


# విజయభాను





విశాఖపట్నం, గురువారం 07-11-2019 VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM సంపుటి : 43 సంచిక : 51 పేజీలు : 8 వెల : 1 రూపాయి


## ఇసుక ధరను నియంత్రించాలి

- నియోజకవర్గాల వారీ ధర నిర్ణయం
- సరిహద్దుల్లో నిఘా పెంచండి..
- టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలి..
- సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి..
- అవసరమైతే స్టాక్ పాయింట్లు పెంచాలి..
- ప్రతిపక్షాలు శవరాజకీయాలు చేస్తున్నాయి..
- మద్యాన్నీ నియంత్రించాల్సిందే
- సీఎం వైఎస్ జగన్ మంత్రులతో సమీక్ష



అమరావతి : ఇసుక మాఫియా, స్మగ్లింగ్ నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఇసుక విధానంపై సీఎం వైఎస్ జగన్ కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇసుక ధరలకు కళ్లెం వేయాలని అధికారులకు సీఎం ఆదేశించారు. అంతేకాకుండా ఇసుక ధర నియంత్రణకు ప్రత్యేక చట్టం తీసుకు రావాలని నిర్ణయం తీసుకున్నారు. ఈలోగా ఆర్డినెన్స్ సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. జిల్లాలు, నియోజకవర్గాల వారిగా ధలను నిర్ణయించాలని కలెక్టర్లు, గనుల శాఖ అధికారులకు సీఎం వైఎస్ జగన్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పోలీసు, గనుల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**సరిహద్దుల్లో నిఘా పెంచండి..**

ఎక్కువ ధరకు అమ్మితే జైలుకు పంపేలా చట్టం తీసుకు రండి. ఏ జిల్లాలో, ఏ

తరువాయి 2లో..

## ఏపీ తెలుగు అకాడమీ చైర్ పర్సన్‌గా లక్ష్మీపార్వతి నియామకం

ప్రభుత్వం ఉత్తర్వులు జారీ



అమరావతి: వైసీపీ నేత లక్ష్మీపార్వతికి కీలక పదవి దక్కింది. ఆమెను ఏపీ తెలుగు అకాడమీ చైర్ పర్సన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. లక్ష్మీపార్వతి ప్రస్తుతం వైసీపీ ప్రధాని కార్యదర్శిగా ఉన్నారు.

## ఏసీబీ వలలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు

విజయవాడ/ కాకినాడ: అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి ఇద్దరు ప్రభుత్వ అధికారులు చిక్కారు. భారీగా అక్రమాస్తులు కూడబెట్టారన్న ఆరోపణలతో విజయవాడ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగంలో బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్న మురళీ గౌడ్ ఇంటిపై ఏసీబీ అధికారులు బుధవారం దాడులు చేశారు. సోదాల్లో భారీగా ఆస్తుల పత్రాలు, నగదును అధికారులు గుర్తించినట్టు సమాచారం. 2014లో సీఆర్డీఏలో

తరువాయి 2లో..

## రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆన్‌లైన్‌లోనే..

మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రిజిస్ట్రేషన్
ఉపముఖ్యమంత్రి పిల్లి సుభాష్ చంద్ర బోస్



కాకినాడ: రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ప్రక్రియ సులభతరం చేసిందని, మధ్యవర్తుల ప్రమేయం లేకుండానే సేల్ డీడ్‌ను ఆన్ లైన్ ద్వారా చేసుకోవచ్చునని ఉపముఖ్యమంత్రి, రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖామాత్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ తెలిపారు. బుధవారం కాకినాడ జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఉపముఖ్యమంత్రితో పాటు రహదారులు, భవనాల శాఖ మంత్రి ధర్మాన కృష్ణ దాస్, వ్యవసాయ శాఖా మంత్రి కురసాల కన్నబాబుతో కలిసి ఆన్ లైన్ ద్వారా సులభతర రిజిస్ట్రేషన్ విధానాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈ విధానాన్ని ఆస్తి కొనుగోలు, విక్రయాల్లో దళారుల ప్రమేయం లేకుండా పూర్తి పారదర్శకతతో ఈ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిందన్నారు. ఇప్పటికే ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ 1వ తేదీన ప్రారంభించండం జరిగిందని,

తరువాయి 2లో..

## నవంబర్ 15లోగా రైతు భరోసా వినియోగించుకోండి

కౌలు రైతులకు గడువుపెంపు

అమరావతి : సాధారణ రైతులు నవంబరు 15లోగా రైతు భరోసా పథకాన్ని వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఈ పథకం కింద లబ్ధి పొందే రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే శనివారం ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించి వాటిని పరిష్కరించాలని కల్లెక్టర్లను ఆదేశించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ... రైతు భరోసా అమలులో భాగంగా కౌలు రైతులకు గడువు మరింతగా పెంచినట్లు పేర్కొన్నారు. రబీ సీజన్ ఇప్పుడే మొదలైంది కాబట్టి కౌలు రైతులకు గడువు పెంచుతున్నాం. రైతుల్లో, కౌలు రైతుల్లో అవగాహన పెరిగి ఇప్పుడిప్పుడే సాగు ఒప్పందాలు చేసుకుంటున్న నేపథ్యంలో వారికి మాత్రమే డిసెంబర్ 15 వరకు గడువు ఇస్తున్నాం సీఎం జగన్ స్పష్టం చేశారు.

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతు భరోసా పథకం ద్వారా ఇప్పటి వరకు 40 లక్షల 84 వేల మందికి లబ్ధి చేకూరిందని వ్యవసాయ కమిషనర్ అరుణ్ కుమార్ తెలిపారు. పథకం అమలులో భాగంగా బుధవారం లక్షా

తరువాయి 2లో..

## ప్రజా సంకల్పానికి రెండేళ్లు.. వైకాపా నేతల్లో ఆనందోత్సాహాలు



తాడేపల్లి : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడి హోదాలో చేసిన ప్రజా సంకల్ప యాత్రకు నేటితో సరిగ్గా రెండేళ్లు నిండాయి. ఈ సందర్భంగా సీఎం క్యాంప్ కార్యాలయంలో బుధవారం సంబరాలు జరిగాయి. ఈ సంబరాల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, మంత్రులు బొత్స సత్యనారాయణ, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ తలశిల రఘురామ్‌లు కేక్ కట్ చేశారు. రాజన్న రాజ్యం మళ్లీ తీసుకు రావాలన్న సంకల్పంతో చేపట్టిన చరిత్రాత్మక పాదయాత్రకు ప్రజలు అడుగడుగున బ్రహ్మారథం పట్టిన సంగతి తెలిసిందే. ఇడుపులపాయలో దివంగత మహానేత వైఎస్

తరువాయి 2లో..

## అగ్నిప్రమాద బాధితులకు ప్రభుత్వ సహాయమందిస్తాం

- 20 పూరి గుడిసెలు దగ్ధం
- సంఘటనా స్థలికి హుటాహుటిన మంత్రి
- నిత్యావసరాల పంపిణీకి ఆదేశాలు జారీ
- పేద వారందరికీ ఉగాది నాటికి ఇళ్లు

కాకినాడ : బుధవారం కాకినాడ రూరల్ మండలం వాకలపూడి సూర్యారావుపేటలో సంభవించిన అగ్ని ప్రమాద వార్త తెలిసిన వెంటనే వ్యవసాయ మరియు సహకార శాఖ మంత్రి కురసాల కన్నబాబు హుటాహుటిన బయలుదేరి సంఘటనా స్థలాన్ని సందర్శించి బాధితులను పరామర్శించారు.

ప్రమాద సంఘటన తెలిసిన వెంటనే అగ్నిమాపక శాఖ వారు ప్రమాద స్థలానికి చేరుకుని, మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు 20 పూరె గుడెసలు దగ్ధమయ్యాయి. అగ్ని ప్రమాద బాధితులు ఇళ్ళతో పాటు సామాగ్రి అంతా మంటల్లో కాలిపోయిందని కట్టు బట్టలతో మిగిలామని మంత్రికి తమ గోడును విన్నవించుకున్నారు.

ఈ సందర్భంగా వ్యవసాయ శాఖా మంత్రి కన్నబాబు స్పందిస్తూ ప్రభుత్వ పరంగా సహాయం అందజేస్తామన్నారు. బాధితులందరికీ నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని తహశిల్దార్‌కు మంత్రి ఆదేశించారు. ఈ ప్రాంతంలో ఎవరూ క్రొత్తగా పాకలు వేయవద్దని మంత్రి కన్నబాబు ఆ ప్రాంత వాసులకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గృహాలు లేని పేద వారందరికీ ఉగాది నాటికి అందరికి ఇళ్ళు అందజేయనుందని, కావున ఈ ప్రాంతంలో పాకలు వేయవద్దని మంత్రి కన్నబాబు తెలిపారు.

ఈ కార్యక్రమంలో యం.ఎల్.సి. రాము సుర్యారావు, కాకినాడ ఆర్.డి.ఓ. ఎ.వి. చిన్ని కృష్ణ, కాకినాడ ఫైర్ ఆఫీసర్ రాజా, క్రైమ్ డి.ఎస్.పి. భీమారావు, రూరల్ సిఐ ఎ.మురళీకృష్ణ, వై.యస్.ఆర్. పార్టీ నాయకులు బెజవాడ సత్యనారాయణ, వలసపాకల కిట్టూ, తదితరులు పాల్గొన్నారు.

## జనంతోనే.. జనంలోనే ఉంటా

సర్కార్‌కు సినిమా చూపిస్తా.. కొత్తగా అయిదుమందికి చోటు



అమరావతి: జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ మరో కీలక నిర్ణయాన్ని తీసుకున్నారు. రాజకీయ వ్యవహారాల కమిటీని విస్తరించారు. కొత్తగా అయిదుమందికి చోటు కల్పించారు. బుధవారం మధ్యాహ్నం ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.

వారితో పాటు- అధికార ప్రతినిధులుగా ముగ్గురిని కొత్తగా నియమించారు. వారి పేర్లను ప్రకటించారు. భవన నిర్మాణ కార్మికులకు సంఘీభావాన్ని తెలుపుతూ ఈ నెల 3వ తేదీన విశాఖపట్నంలో నిర్వహించిన లాంగ్ మార్చ్ దిగ్విజయమైందని పవన్ కల్యాణ్ చెప్పారు.

ప్రభుత్వ వైఖరిని దనుమాడుతూ చేపట్టిన ఈ ఆందోళనను విజయవంతం చేయడానికి పార్టీ తరఫున కృషి చేసిన నాయకులకు ఆయన కృతజ్ఞతతు తెలిపారు.

పంతం నానాజీ, పితాని బాలకృష్ణలకు ఛాన్స్.. జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీలో కొత్తగా అయిదుమందిని తీసుకున్నట్లు పవన్ కల్యాణ్ వెల్లడించారు. పంతం నానాజీ, మధుసూదన్ రెడ్డి, బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, పితాని బాలకృష్ణలకు కొత్తగా చోటు కల్పించినట్లు చెప్పారు. రాజకీయ వ్యవహారాల కమిటీని విస్తరించాలనే ఉద్దేశంతోనే వారికి ఇందులోకి తీసుకున్నామని అన్నారు.

ఈ కమిటీకి నాదెండ్ల మనోహర్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. విశాఖపట్నంలో లాంగ్ మార్చ్‌ను విజయవంతం కావడానికి అహర్నిశలు పని చేసిన సత్య బొలిశెట్టి, శివశంకర్ తమ్మిరెడ్డిలకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని పవన్ కల్యాణ్ అన్నారు. త్వరలోనే వీరిద్దరికీ పార్టీలో కీలక పదవులు, కొత్త బాధ్యతలను అప్పగిస్తానని చెప్పారు.

తరువాయి 2లో..




# పీఆర్టీయూ ఆధ్వర్యంలో బాలల ప్రతిభా పాటవ పోటీలకు పోటెత్తుతున్న విద్యార్థులు



నర్సీపట్నం : బాలల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు గత 13 సంవత్సరాలుగా పిఆర్‌టియు యూనియన్ ప్రత్యేకంగా కృషి చేస్తుందని పిఆర్టియు జిల్లా అధ్యక్షులు డీజి నాద్ తెలిపారు. వ్యాసరచన పోటీ లకు అనూహ్యమైన స్పందన రావడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు. నిజాయితీగా వ్యాసరచన పోటీలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరికి కేవలం టోకెన్ నెంబర్ మాత్రమే ఇచ్చామన్నారు. జడ్జికి ఎటువంటి రాగద్వేషాలు ఉండకుండా ఉండేందుకు వీలుగా ఎవరి పేర్లు వ్యాసరచన పేపర్లపై ఉండవు అన్నారు. రోలుగుంట పిఆర్టియు అధ్యక్ష కార్యదర్శులు శేషు మాస్టారు తదితరులు పాల్గొని మాట్లాడారు .ప్రభుత్వ పాఠశాలల నుండి సుమారు 50 శాతం పోటీ పరీక్షల్లో పాల్గొని తమ సత్తాను చాటుకున్నారు అని తెలిపారు. పిఆర్‌టియు ద్వారా అనేక కార్య క్రమాలు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే చిత్రలేఖనం పోటీలు పోటీలు చాలా చక్కగా నిర్వహించామని, మంచి స్పందన లభించిందని వారు తెలిపారు. నవంబర్ 14న బాలల దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తామని వారు తెలియజేశారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల బకాయి బిల్లులు వెంటనే విడుదల చేయాలి : సిఐటియు




పెద్దాపురం : పెద్దాపురం మండలం, పట్టణంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు భోజనాలు వండి పెడుతున్న మధ్యాహ్న భోజన కార్మికులకు బకాయి బిల్లులు వెంటనే విడుదల చెయ్యాలని సిఐటియు నాయకులు డి.క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. యాసలపు సూర్యారావు భవన్లో మిడ్డేమిల్స్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) మండల విస్తృత సమావేశం సంఘం అధ్యక్షులు కరక సుబ్బలక్ష్మి అధ్యక్యతన జరిగింది. ఈ సందర్భంగా క్రాంతి కుమార్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులందరికి వేతనాలు పెంచుతానని ప్రభుత్వం హామి ఇచ్చిందని కానీ నెలకు 3 వేలరూపాయలకు మాత్రం వేతం చేసిందని అన్నారు. ఇందులో కేంద్రం వాటా సగం తీసేస్తే రాష్ట్ర ప్రభుత్వం పెంచింది నామమాత్రమే అన్నారు. పాద యాత్రలో మధ్యాహ్న భోదనాన్ని ప్రైవేటు సంస్థ లకు అప్పగించే ఉద్దేశంలేదని హామి ఇచ్చి ఇప్పుడు మధ్యాహ్న భోజనాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించే పని ప్రారంభించారని అన్నారు. ప్రైవేటు సంస్థలపై ఉన్న ప్రేమ మధ్యాహ్న భోజన కార్మికులపై లేదా అని ప్రశ్నించారు. జనవరి నెలనుండి పాఠశాలల్లో భోజన బిల్లులు బకాయిలు ఉన్నాయని వీటిని వెంటనే విడుదల చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గాడి సత్యవతి, లక్ష్మీ, ఏసురత్నం, తాయారు తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్రప్రదేశ్ ప్రియతమ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర (పాదయాత్ర) ప్రారంభించి 2 సంవత్స రాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మద్దిలపాలెం నగర పార్టీ కార్యాలయంలో కేక్ కటింగ్ అనంతరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సీఎం పాద యాత్రలో ప్రజల సమస్యలు తెలుసుకొని అద్భుతంగా పరిపాలన చేయడానికి ప్రజాసంకల్ప యాత్ర దోహదపడింది అన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిధిగా రాష్ట్ర మంత్రి అవంతి శ్రీనివాస్ కేక్ కట్ చేయగా, విఎంఆర్‌డిఎ ఛైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస్, మల్ల విజయ ప్రసాద్, కె.కె.రాజు మరియు వైసీపీ శ్రేణులతో నగర అధ్యక్షులు వంశీకృష్ణ శ్రీనివాస్ నిర్వ హించారు. కార్యక్రమంలో విజయవంతం చేసిన అందరికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఇసుక తోట వద్ద విజయ పార్లర్ ప్రారంభోత్సవ కార్యక్రమం తరువాత 9వవార్డు హెచ్‌బీ కాలనీలో ఇటీవల మరణించిన పి.గోవింద్ సెరిమనీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వాలంటీర్ల తమ మొదటి గౌరవ వేతనం

### *అనాథ పిల్లలకు అన్నదానం*



వాలం టీర్లు అందరూ ఆ పిల్లలని ఒక్కొ క్కరు గా పరిచయం చేసుకుని, వారితో సరదాగా కాసేపు గడిపారు. ఈ పిల్లలతో గడిపినందుకు చాలా సంతోషంగా ఉందని వాలంటీర్లు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. వార్డు వాలంటీర్ డొప్ప.శ్రీను మాట్లాడుతూ అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది అని అలాంటి బృహత్తర కార్య క్రమం లో వాలం టీర్లు అందరూ పాల్గొన్నం దుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో

భీమునిపట్నం : భీమిలి జోన్ వాలంటీర్లు తమ మొదటి గౌరవ వేతనం అంది నందుకు, ఏదైనా ఒక సేవా కార్యక్రమం చేయాలనే సదుద్దేశంతో, తాళ్లవలసలో ఉన్నటువంటి మన కుటుంబం చారిటబుల్ ట్రస్ట్ , బాలల సంరక్షణ కేంద్రం లో ఉన్న అనాథ పిల్లలకు అన్నదానం చేశారు. తదుపరి ఆ విద్యార్థులకు నోటు పుస్తకాలను, బకెట్లులను, అందజేశారు. తరువాత వార్డు వాలంటరీ లైనా వియ్యపు కనక రాజు, పుష్ప, ఆదిలక్ష్మి ,వియ్యపు ధనరాజు, కె.వి.రెడ్డి, భాస్కర్, శివ, గోవింద్ పూర్ణిమ సంతోషి, హైందవి, దేవి, శ్వేతా, శిరీష, దివ్య, లక్ష్మణ స్వామి, మొదలైన వాలం టీర్లు పాల్గొన్నారు.

మరియు ట్రస్టు మెంబర్ వెంపాడ శ్రీనివాసరెడ్డి, సభ్యులు భాను, దినేష్ పాల్గొన్నారు.

## అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

సబ్బవరం : మండలంలోని తవ్వవానిపాలెంలో అక్రమంగా బెల్ట్ షాపు నిర్వహిస్తున్న బోకం వెంకటరమణ (44) అనే వ్యక్తిని స్థానిక పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసారు. ఈ సంఘటనకు సంబంధించి స్థానిక సిఐ ఆర్.వి.వి.ఎస్.ఎస చంద్రశేఖర్‌రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తవ్వవానిపాలెంలో బోకం వెంకటరమణ అక్రమంగా మద్యం విక్రయాలు సాగిస్తున్నాడంటూ అందిన సమాచారం మేరకు స్థానిక పోలీసులు ఆ గ్రామంలో దాడులు నిర్వహించగా మద్యం విక్రయిస్తూ బోకం వెంకటరమణ పట్టుబడ్డాడని, అతని వద్ద నుండి సుమారు 500 రూపాయలు విలువ చేసే వివిధ రకాల మద్యం సీసాలను సీజ్ చేసామని పేర్కొన్నారు. అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు తెలిపారు.

## దేవరాపల్లిలో భారీ అన్న సమారాధన

దేవరాపల్లి : మండల కేంద్రంలోని రామాలయం వద్ద నెలకొల్పిన గౌరీ పరమేశ్వరుల మండపం వద్ద బుధవారం భారీ అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. స్థానిక కోదండరామ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వరదపురెడ్డి లలితా నాయుడు, టీడీపీ నాయకులు వై. కరుణాకర్ నాయుడు, సామాజిక కార్యకర్త వాలేటి నాగరాజు, కోదండరామ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## ఈ నెల 9న స్కిల్ కనెక్ట్ డ్రైవ్

నర్సీపట్నం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా నర్సీపట్నం రిషి డిగ్రీ కళాశాలలో ఈ నెల 9వ తేదీన స్కిల్ కనెక్ట్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్కిల్ కనెక్ట్ డ్రైవ్‌లో సినెర్జిస్ కాస్టింగ్ ప్రైవేటులిమిటెడ్, ఈనన్తిలాబ్స్, సియాంక్ ఫార్మసీ, దివీస్ లాబ్స్ హాజరు కానున్నాయన్నారు. 10వ తరగతి, ఇంటర్, బియస్సీ కెమిస్ట్రీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ, బి ఫార్మసి, డిప్లమా ఇన్ కెమికల్ నిరుద్యోగ యువత అర్హులన్నారు. ఐటిఐ అన్ని ట్రేడ్స్‌కు, డిప్లొమా మెకానికల్, ఆటో మొబైల్ చదివిన నిరుద్యోగ యువత ఒరిజినల్స్ సర్టిఫికేట్స్, బయోడేటాతో పాటు ఆధార్ కార్డుతో హాజరు కావాలని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే యువత www.APSSDC.IN వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని అడ్మిట్ కార్డుతో హాజరు అవ్వాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.10వేల నుండి రూ.16వేల వరకు జీతాలు ఉంటాయన్నారు. మరెన్ని వివరాలకు 9014765287, 9010023033కు సంప్రదించాలన్నారు.

## అన్యాయంగా విధుల నుంచి తొలగించడం దారుణం



సీపీఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కోటవురట్ల : కోటవురట్ల సిహెచ్‌సి వద్ద శానిటేషన్ కార్మికులుగా గత పదిహేను ఏళ్ల నుండి పని చేస్తున్న కార్మికులను అన్యాయం తొలగించడం దారుణమని సిపిఎం జిల్లా నాయకులు అప్పలరాజు, డేవిడ్‌రాజు అన్నారు.

బుధవారం సిహెచ్‌సి వైద్యాధికారి రాజేష్‌కు కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీరిని డ్యూటికి రావద్దని చెప్పడం సరైంది కాదన్నారు. తక్షణమే వీరిని విధుల్లోకి తీసుకొని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి, కార్మికులు జి.చిన అప్పయ్యమ్మ, బి.రత్నం, జి.రామయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో అన్నప్రసరణ కార్యక్రమం



అన్నప్రసరణ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

నాతవరం : పోషణ వేదిక కార్యక్రమంలో భాగంగా నాతవరం అంగన్వాడీ కేంద్రరా 2, 4లో అంగన్వాడీ కార్యకర్తలు ఎస్.గజలక్ష్మి, ఎస్.వరలక్ష్మి ఆధ్వర్యంలో చిన్నారులకు బుధవారం అన్నప్రసరణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ నెలలో మొదటి బుధవారం చిన్నారులకు అన్నప్రసరణ కార్యక్రమం, రెండో బుధవారం గర్భిణీలకు సీమంతాల కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## ఇసుక ధరను నియంత్రించాలి

నియోజకవర్గంలో ఎంత రేటు పెట్టాలో కలెక్టర్లతో మాట్లాడి నిర్ణయించండి. రేటు నిర్ణయించాక ధరలను ప్రకటించాలి. నిర్ణయించిన ధరలు ప్రజలకు అర్థమయ్యేలా కలెక్టర్లు ప్రచారం చేయాలి. నిర్ణయించిన రేటుకే ఇసుకను అమ్మాలి. ఈలోగా ఇసుక సరఫరాను బాగా పెంచాలి. సరిహద్దుల్లో నిఘాను పెంచండి. ఎట్టిపరిస్థితుల్లోనూ స్మగ్లింగ్ చేయకూడదు. టెక్నాలజీని వాడుకోండి. స్మగ్లింగ్ జరిగితే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది.

టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలి..

ఇసుకను అధిక రేటుకు అమ్ముతున్నారని ఎవరైనా ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకోవాలి, జైలుకు పంపాలి. అవినీతికి తావులేకుండా చేస్తున్నాం, అయినా సరే మనం విమర్శలకు గురవుతున్నాం. ఎమ్మెల్యేలు, మంత్రులు అవినీతికి దూరంగా ఉన్నారు, అయినా సరే బండలు వేస్తున్నారు, ఆరోపణలు చేస్తున్నారు. వచ్చే వారం స్పందన నాటికి ఈ రేట్లు, టోల్ ఫ్రీ నంబర్ ప్రకటించాలి. వచ్చేవారం స్పందన కేవలం ఇసుక సమస్యపైనే నిర్వహిస్తాం. స్పందనలో ఇసుక వారోత్సవం తేదీల ప్రకటిస్తాం.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి..

275 రీచ్‌ల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారా? లేదా? 275 రీచ్‌ల్లో ఏం జరుగుతుందనే దానిపై మనం చూడగలగాలి. ఇసుక తవ్వకాలు నిలిచిపోతే ఎందుకు నిలిచిపోయాయో మనం తెలుసుకునే అవకాశం కలగాలి. మొత్తం 275 చోట్ల కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి, మనం లైవ్‌లో చూడగలగాలి. మైనింగ్ అధికారులు, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారులు కంట్రోల్ రూంద్వారా చూడగలగాలి. రాత్రి పూట కూడా పనిచేయగలిగే సీసీ కెమెరాలు పెట్టాలి.

అవసరమైతే స్టాక్ పాయింట్లు పెంచాలి..

వరద నీరు తగ్గగానే అన్ని రీచ్‌లనుంచి ఇసుక సరఫరా ప్రారంభం కావాలి. ప్రతి రీచ్ వద్ద సీసీ కెమెరాలు పెట్టాలి. ఇసుక సరఫరా కోసం వాహనాలు పుష్కలంగా అందుబాటులో ఉండాలి. కిలోమీటర్‌కు రూ.4.90 చొప్పున ఇసుక రవాణాకు ఎవరు ముందుకు వచ్చినా వారికి వెంటనే అనుమతి ఇవ్వాలి. ఇసుక నిల్వలు సరిపడా ఉన్నంతవరకూ విరామం లేకుండా పనిచేయాలి. అవసరమైతే ఇంకా స్టాక్ పాయింట్లు పెంచాలి. ఇసుక విషయంలో ఎవ్వరూ వేలెత్తిచూపకుండా ఇసుక సరఫరా కావాలి. అలాగే రీచ్‌ల వద్ద ఈ నెలాఖరు నాటికి కెమెరాలు, వే బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలి. ఆలస్యంకాకుండా వేర్వేరు సంస్థలనుంచి సాంకేతిక సహకారం తీసుకోండి.

ప్రతిపక్షాలు శవరాజకీయాలు చేస్తున్నాయి..

వరదలన్నవి మన చేతిలో లేవు. ఆగస్టునుంచి ఇవ్వాళ్టి వరకూ నదుల్లో అలానే వరద కొనసాగుతోంది. అధికారంలోకి వచ్చి 5నెలలు అయింది. మంత్రులు జూన్‌లో ప్రమాణ స్వీకారం చేశారు, పాలనకు సన్నద్ధమయ్యేలోగా ఆగస్టులో వరదలు ప్రారంభం అయ్యాయి. అధికారం చేపట్టిన 5నెలల్లో 3 నెలలు వరదలు వచ్చిన విషయాన్ని గర్తుంచుకోవాలి. ప్రతిపక్షాలు శవరాజకీయాలు చేస్తున్నాయి. ఏ ఇష్యూ లేక ప్రతిపక్షాలు ఇసుక అంశాన్ని పట్టుకున్నాయి. మంచి మనసుతో పనిచేస్తున్నప్పుడు కచ్చితంగా దేవుడు సహకరిస్తాడుఅని సీఎం వైఎస్ జగన్ అధికారులతో పేర్కొన్నాడు.

మద్యం నియంత్రణపై సమీక్ష..

ఇసుక విధానంతో పాటు మద్యం నియంత్రణపై కూడా సీఎం వైఎస్ జగన్ సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో ఎవరైనా లిక్కర్ అమ్మితే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. లిక్కర్ అమ్మినట్టు ఫిర్యాదు రాగానే కచ్చితంగా జైలుకు పంపాలని, దీనిపై కూడా టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలన్నారు. మద్యం నియంత్రణపై కూడా చట్టం తీసుకురావాలని అభిప్రాయపడ్డారు. దీనిపై విధివిధానాలకు మరో సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులను సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు.

## రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆన్‌లైన్‌లోనే..

దీనిని విస్తృతంగా అలగాహన కల్పించే విధంగా ఒంగోలులో ప్రారంభించడం జరిగిందన్నారు. తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో అవగాహనా కార్యక్రమాల్లో భాగంగా జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో లాంఛనంగా ప్రారంభించడం జరిగిందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఉన్న వారు తమ ఇంటి వద్దనే రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చునని, కంప్యూటర్ సెంటర్ లో కూడా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చన్నారు. రిజిస్ట్రేషన్ చేయిచుకుని, అక్కడ పొందిన రశీదగు ద్వారా రిజిస్ట్రార్ కార్యాలయంలో అందిస్తే నిర్దేశిత సమయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందని మంత్రి తెలిపారు. ఆస్థి కొనుగోలు ముందు అనుసరించాల్సిన విధివిధానాలు, దస్తావేజుల తయారీ, ఆస్తి బదలాయింపుకు నియమ నిబంధనలు ఆన్ లైన్ ద్వారా దస్తావేజులు తయారీ విధానాన్ని పూర్తిగా తయారు చేసిన డాక్యుమెంట్‌ను అందుబాటులో ఉంచడం ద్వారా వినియోగదారులకు పూర్తి సమాచారంతో ఈ ప్రక్రియను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ విధానాన్ని విస్తృత స్థాయిలో రిజిస్ట్రేషన్ శాఖ అవగాహన కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా మంత్రి కురసాల కన్నబాబు ఆన్ లైన్ ద్వారా జరిగే సులభతర రిజస్ట్రేషన్ విధానాన్ని అడిగి తెల్సుకోవడంతో పాటు వాటిలో ఏమైనా సమస్యలు తలెత్తితే ఏమి చేయాలనే అంశాలను అధికారులను అడిగి తెల్సుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మంత్రివర్యులకు పూర్తి వివరాలు అందించారు. ఈ సందర్భంగా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ జాయింట్ ఐజి రవి కుమార్, డిఐజి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ సరోజ, జిల్లా రిజిస్ట్రార్ సంబంధిత శాఖల అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్, మంత్రులు కురసాల కన్నబాబు, ధర్మాన కృష్ణ దాస్ సులభతర ఆన్ లైన్ రిజిస్ట్రేషన్‌పై రూపొందించిన యూజర్ మ్యాన్యువల్ ను విడుదల చేశారు.

## నవంబర్ 15లోగా రైతు భరోసా వినియోగించుకోండి

ఏడు వేల రైతు కుటుంబాలకు 97 కోట్ల రూపాయలు బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. అదే విధంగా ప్రతీ బుధవారం పథకం కొత్త లబ్దిదారులకు రైతు భరోసా కింద సహాయం అందజేస్తామని పేర్కొన్నారు. నవంబర్ 15 నాటికి అర్హులైన రైతులందరి ఖాతాల్లో నగదు జమ చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించినట్లు తెలిపారు. అదే విధంగా ఈనెల 9న రైతు భరోసా కోసం ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా ప్రతీ మండలంలో తహశీల్దార్, వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో అర్హులైన రైతుల అర్జీలు పరిష్కరిస్తామని తెలిపారు. కౌలు రైతులకు కూడా డిసెంబర్ 15 వరకు రైతు భరోసా గడువు పెంచినట్లు పేర్కొన్నారు.

## *జనంతోనే.. జనంలోనే ఉంటా*

పార్టీ అధికార ప్రతినిధులుగా సుజాత పండ, సుందరాపు విజయ్ కుమార్, పరుచూరి భాస్కర్ రావులను నియమించారు. తమ శక్తివంచన లేకుండా వారు పార్టీ అభివృద్ధికి కృషి చేశారని, పార్టీ గళాన్ని గట్టిగా వినిపించారని పవన్ కల్యాణ్ అభినందించారు. ఇకముందు కూడా పార్టీ అధికార ప్రతినిధులుగా తమ వైఖరిని, పార్టీ నిర్ణయాలను జనంలోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత వారిపై ఉందని చెప్పారు. లాంగ్ మార్చ్ ను అంచనాలకు మించి విజయవంతం చేసిన జన సైనికులు, వీర మహిళలలకు కృతజ్ఞతలను తెలియజేస్తున్నాని అన్నారు.

## ఏసీబీ వలలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు

టౌన్ ప్లానింగ్ అధికారిగా, 2017లో తిరుపతిలో అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా విధులు నిర్వస్తున్న సమయంలో మురళీ గౌడ్ భారీగా అక్రమాస్తులు కూడపెట్టారని ఆరోపణలు వచ్చాయి. దీంతో విజయవాడతో పాటు తిరుపతి, కర్నూల్, హైదరాబాద్, బెంగళూరులో ఏకకాలంలో ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టారు. సుమారు 50 కోట్ల రూపాయల విలువైన అక్రమాస్తులు కలిగివున్నారని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ పోర్ట్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా పని చేస్తున్న గుణ్ణం సత్యనారాయణ చౌదరి నివాసాల్లోనూ ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. జగన్నాథపురం మరీడమ్మపేటలోని సత్యనారాయణ నివాసంతో పాటు కాకినాడ, రెండు రావులపాలెంలో రెండేసి చోట్ల, సామర్లకోటలో ఒక చోట ఏకకాలంలో దాడులు చేశారు. కేజీన్నర బంగారు ఆభరణాలు, కేజీ వెండి సహా రూ. రెండున్నర కోట్లు విలువైన ఆస్తి పత్రాలు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. బ్యాంకు అకౌంట్లు సహా, పలు బ్యాంకుల్లో లాకర్లు కలిగి ఉన్నట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు.

## ప్రజా సంకల్పానికి రెండేళ్లు..

రాజ సమాధి వద్ద 2017 నవంబర్ 6న వేసిన తొలి అడుగు.. వందలు, వేలు, లక్షలు, కోట్లాది మంది జనం మధ్య వారి హృదయాలను స్పృశిస్తూ శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో 2019 జనవరి 9వ తేదీన ముగిసింది. రాష్ట్రంలోని 13 జిల్లాల్లోని 134 అసెంబ్లీ నియోజకవర్గాలు, 231 మండలాలు, 2,516 గ్రామాల మీదుగా 341 రోజుల పాటు 3,648 కిలోమీటర్ల మేర యాత్ర సాగింది. 124 సభల్లో, 55 ఆత్మీయ సమ్మేళనాల్లో వైఎస్ జగన్ ప్రసంగించారు. జనం గుండెల్లో దాగి ఉన్న బాధను తెలుసుకున్నారు. నేను విన్నాను.. నేను ఉన్నాను అంటూ ప్రతి ఒక్కరిలో ధైర్యం నింపారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన అద్దేపల్లి..

జనసేన నేత అద్దేపల్లి శ్రీధర్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో ఆయన వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నారు.

# న్యాయ శాస్త్రంలో భుజంగరావుకు వర్సిటీ డాక్టరేట్

## ఉత్తర్వులు అందజేసి అభినందించిన వీసీ ప్రసాద రెడ్డి



ఆంధ్ర విశ్వకళాపరిషత్‌: ఆంధ్రవిశ్వవిద్యాలయం న్యాయ కళాశాల పరిశోధక విద్యార్థి బుడుమూరు భుజంగ రావుకు వర్సిటీ డాక్టరేట్ లభించింది.

ఆచార్య అన్నం సుబ్రహ్మణ్యం, ఆచార్య కె.మధుసూధన రావుల సంయుక్త పర్యవేక్షనలో ' ఇండస్ట్రియల్ పొల్యూషన్ ఇన్ ఇండియా-ఎన్విరో-లీగల్ స్టడీ' అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. వర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో భుజంగరావుకు డాక్టరేట్ ఉత్తర్వులను అందజేసి అభినందించారు.

పారిశ్రామిక కాలుష్యం దేశంలో పెరిగిపోతూ మానవాళి ఆరోగ్యం క్షీణించడానికి కారణమవుతోంది. ఇటువంటి తరుణంలో ప్రస్తుతం ఉన్న చట్టాలను కాలానుగుణంగా మార్పు చేస్తూ, కఠిన నిర్ణయాలు అమలు జరపాల్సిన అవశ్యకతను తన పరిశోధనలో వివరించారు. కాలుష్య కారకులకు అవసరమైతే అధికమెత్తంలో జరిమానాతో పాటు, పరిధిని దాటితే లైసెన్స్‌లు సైతం రద్దుచేయాలని సూచించారు.

ప్రతీ వ్యక్తి తన వంతుగా మూడు మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యతలను తీసుకోవాలని చట్టం తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భుజంగ రావును విభాగ ఆచార్యులు, పరిశోధకులు అభినందించారు.

# దర్శనాల భారతి మాదిగకు ఘన నివాళి

చోడవరంః ఎస్సీలో ఉమ్మడి ఏబిసిడి వర్గీకరణకు, తెలంగాణా ప్రగతి భవన్ ముట్టడి పోరాటంలో కీర్తి శేషులైన దర్శనాల భారతి 2వ వర్ధంతిని చోడవరంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఇందిరా కోలనీలోని ఎమ్మార్పి ఎస్ కార్యకర్తల ఆధ్వర్యంలో ఆమెకు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీయస్ జిల్లా కార్యవర్గ సభ్యులు మోర్తా శ్రీనివాసరావు, ఎలక మల్లిబాబు, వెంకట్, రాజు, కంటిపాప దాసు, కండెల నరసింగరావు, కంటిపాము ఎర్రబాబు, ఎలకా అప్పారావు, గణేష్, కండెల గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలంటూ ర్యాలీ




చోడవరంః పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ కళాశాల విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ జిల్లా అధ్యక్షులు ఎన్. బాష్కరరావు ఆధ్వర్యంలో కళాశాల నుంచి కొత్తూరు జంక్షన్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో మంచినీరు, టాయిలెట్స్ సౌకర్యం కల్పించాలని, అలాగే కళాశాల ప్రహారీగోడ చుట్టూ పేరుకుపోతున్న చెత్తను తొలగించాలంటూ నినాదాలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి వినతి పత్రం అందచేయడంతో సమస్య పరిష్కరించాలని ఈవోపిఆర్‌డి ఛైతన్యను ఎమ్మెల్యే ఆదేశించారు. కళాశాల చుట్టు పక్కల చెత్త వేసిన వారికి 500 జరిమానా విధించనున్నట్లు ఈవోపిఆర్.డి తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు ప్రసన్నకుమార్, బి.రాము, మనస్విని, రామలక్ష్మి, సుమారు 200 మంది విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వాకర్స్ ట్రాక్ పనులు ప్రారంభం



చోడవరంః ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో వాకర్స్ ట్రాక్ పనులకు స్థానిక ఎమ్మెల్యే కరణః ధర్మశ్రీ బుధవారం లాంచనంగా ప్రారంభించారు. 8 లక్షల రూపాయల నిధులతో 400 వందల మీటర్ల పొడవు, 10 అడుగుల వెడల్పుతో ట్రాక్ నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ట్రాక్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయడం పట్ల చోడవరం వాకర్స్ క్లబ్ సభ్యులు పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వై.సిపీ నాయకులతో పాటు వాకర్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ 9న గీతం 10వ స్నాతకోత్సవం

## ముఖ్య అతిథిగా ఎఐసిటిఇ ఛైర్మన్

సాగర్‌నగర్‌: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం 10వ స్నాతకోత్సవాన్ని 9వ తేదీన నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ తెలిపారు. గీతం స్నాతకోత్సవానికి అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఎఐసిటిఇ ) ఛైర్మన్ ప్రొఫెసర్ అనిల్ డి.సహస్రాబుదే ముఖ్య అతిథిగా హజరు కానున్నారని వైస్ ఛాన్సలర్ తెలిపారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విశాఖ ప్రాంగణం నుంచి ఇంజనీరింగ్, ఫార్మశీ, ఆర్కిటెక్చర్, లా, సైన్స్, ఎంబిఎ, బిబిఎమ్, ఇంటర్నేషనల్ బిజినెస్, బిఎ సోషల్ సైన్స్, ఎమ్.ఎ సైకాలజీ, ఇంగ్లీషు, కోర్సులు పూర్తి చేసిన రెండు వేలమంది పట్టభద్రులు, పిహెచ్‌డి డిగ్రీలు అందుకున్న వారికి స్నాతకోత్సవ పట్టాలను ముఖ్యఅతిథి సమక్షంలో అందజేస్తామన్నారు.గీతం ఛాన్సలర్ ప్రొఫెసర్ కోనేరు రామకృష్ణారావు అద్యక్షతన జరగే స్నాతకోత్సవంలో ముఖ్యఅతిథి ప్రొఫెసర్ అనిల్ డి.సహస్రాబుదేకు అందజేస్తామన్నారు.

**డాక్టర్ వి.భుజంగరావుకు 'డిఎస్సీ ' :**



ప్రముఖ రక్షణ రంగ శాస్త్రవేత్త, ప్రస్తుత నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ సైన్సెస్ లో ఇస్రో ఛైర్ ప్రొఫెసర్ గా వ్యవహరిస్తున్న డాక్టర్ వి.భుజంగరావుకు డాక్టర్ ఆఫ్ సైన్స్‌ను అందించనున్నారు. రక్షణ పరిశోధనా రంగంలో 38 సంవత్సరాల సుదీర్ఘఅనుభవం గల డాక్టర్ వి.భుజంగరావు ఎన్ఎస్‌టిఎల్ డైరక్టర్‌గా, నేవల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్ డైరక్టర్ జనరల్‌గా, ఛీఫ్ కంట్రోలర్ రీసెర్చి అండ్ డవలప్‌మెంట్ గా పనిచేశారు.యుద్ధనౌకల సాంకేతిక పరిజ్ఞానంలో పేరొందిన డాక్టర్ వి.భుజంగరావు ఎకోస్టికల్ సోసైటీ ఆఫ్ ఇండియా, కండిషన్ మానిటరింగ్ సోసైటీ ఆఫ్ ఇండియా లకు అధ్యక్షుడుగా పనిచేశారు. దేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలకు అకడమిక్ కౌన్సిల్ సభ్యుడుగా వ్యవహరిస్తున్నారు.

**కాళీపట్నం రామారావుకు గౌరవ డాక్టరేట్ 'డిలిట్'**



ఉత్తరాంధ్రకు చెందిన ప్రముఖ రచయిత, కారా మాస్టారుగా సుపరిచితులైన కాళీపట్నం రామారావుకు గీతం 10వ స్నాతకోత్సవంలో డాక్టర్ ఆఫ్ లెటర్స్ (డిలిట్) గౌరవ డాక్టరేట్‌ను అందించనున్నారు. కేంద్ర సాహిత్య అకాడమి అవార్డును (1995) తో సహ పలు సాహిత్య అవార్డులను అందుకున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన కాళీపట్నం రామారావు కథా రచయితగా ప్రసిద్ధి చెందారు. కారా మాస్టారుగా సాహితీరంగం లోని వారిచే పిలిపించుకునే కాళీపట్నం రామారావు రచనలు పలు భాషలలోకి అనువాదం అయి ఆయన పేరును జాతీయ స్థాయిలో నిలిపాయి. సమాజంలోని ప్రజల సమస్యలను ఇతివృత్తాలుగా ఎంచుకుని కాళీపట్నం రామారావు రచించిన యజ్ఞం వంటి కథలు ఆయనకు పేరుతెచ్చాయి. విశాఖ రచయితల సంఘం, విప్లవ రచయిత సంఘం (విరసం) లకు వ్యవస్థాపక సభ్యుడుగా వ్యవహరించిన కాళీపట్నం రామారావు శ్రీకాకుళంలో కథానిలయం ఏర్పాటుచేసి యువ రచయితలను ప్రోత్సహించే ప్రయత్నం చేస్తున్నారు.

**డాక్టర్ ఎస్.వి.ఆదినారాయణ రావుకు "డిఎస్సీ":**



ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్, ఫ్రీ పోలియో సర్జికల్ అండ్ రీసెర్చి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ప్రేమా ఆస్పత్రి డైరక్టర్ జనరల్ డాక్టర్ ఎస్.వి.ఆదినారాయణ రావుకు డాక్టర్ ఆఫ్ సైన్స్ (డీఎస్సీ) పేరిట గౌరవ డాక్టరేట్‌ను అందజేయనున్నారు. పోలియో శస్త్ర చికిత్సలో పేరొందిన డాక్టర్ అదినారాయణ రావు ఆంధ్ర వైద్య కళాశాల, ఉస్మానియా వైద్య కళాశాలల్లో ఆర్థోపెడిక్ ప్రొఫెసర్‌గా పనిచేశారు.20కి పై పరిశోధనా పత్రాలను వెలువరించారు. విశాఖలోని రాణి చంద్రమతీ దేవి అస్పత్రి సూపరింటెండెంట్‌గా సేవలందించారు.డాక్టర్ ఆదినారాయణరావు రచించన 'సర్జరీ ఆన్ పోలియో డిజిబిలిటీ' అనే పుస్తకం వైద్య రంగంలో ప్రాచుర్యం పొందింది. దేశంలో 38 మంది ఆర్థోపెడిక్ సర్జన్‌లకు శిక్షణ ఇచ్చిన డాక్టర్ ఆదినారాయణరావు జాతీయ అవార్డుతో పాటు వివిధ సంస్థలు 100కు పైగా అవార్డులతో సత్కరించాయి. వైద్య రంగానికి ఆయన చేస్తున్న సేవలకు గుర్తింపుగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలంయం గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. స్నాతకోత్సవంలో పై ప్రముఖులతో పాటు ఉత్తమ పరిశోధకులకు, ఉత్తమ సిద్ధాంత వ్యాసాలను ,(పిహెచ్‌డి) సమర్పించిన వారికి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలను అందజేయనున్నట్లు గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ తెలిపారు.

# వైజాగ్‌పట్నం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ

విశాఖపట్నం: విసిసిఐ ఉమెన్స్ వింగ్ అనేది వ్యాపార అంతర్దృష్టులను మరియు వ్యాపార సామర్థ్యాన్ని ప్రోత్సహించే సంస్థ. ఇది పౌర మరియు శిక్షణా కార్యకలాపాల యొక్క అనేక రంగాలలోకి ప్రవేశించింది. బుధవారం వైజాగ్‌లోని ఐఐఎఎం వద్ద ఎంబీఏ విద్యార్థుల కోసం స్పీకర్ సెషన్‌ను విజయవంతంగా నిర్వహించింది. వక్తలు అనిలా నార్లా మరియు సత్యప్రెమా, ఇద్దరూ నగరంలోని విజయవంతమైన వ్యాపార మహిళలు. విద్యార్థుల కార్యకలాపాలు ప్రశ్నలకు చురుకుగా వినిపించడంతో సజీవ ఇంటరాక్టివ్ సెషన్ జరిగింది.

# ఈ నెల 9న అఖండ నామ సంకీర్తన

నర్సీపట్నం : సత్యసాయి జయంతిని పురస్కరించుకొని నర్సీపట్నం శ్రీ భగవాన్ సత్యసాయి మందిరంలో ఈ నెల 9న అఖండ నామ సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని మందిర ప్రతి నిధులు తెలిపారు. బుధవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆ రోజు సాయంత్రం 6 గంటల నుంచి మరుసటి రోజు సాయంత్రం 6 గంటల వరకు నిర్విరామంగా సంకీర్తనలు అందించ నున్నామని తెలిపారు.

ఈ కార్య క్రమాన్ని భక్తులు విజయ వంతం చేయాలని కోరారు.

# యువత అన్ని రంగాల్లో ముందుకు సాగాలి

విశాఖ సిటీః నేటి యువతరం ఉద్యోగాల కోసం ప్రభుత్వంపై ఆధారపడకుండా తమ సొంత కాళ్లపై నిలబడి దక్కిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలని విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం ఉదయం ఇసుక తోట జంక్షన్‌లోని స్వగృహ ఎదురుగా శ్రీ విజయ పార్లర్ ను ఎంపీ ప్రారంభించారు. అనంతరం పార్లర్ యజమానులు సిద్ధ బత్తుల రాజేష్, జె. ఏ. నాయుడు లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ ఆహార పదార్థాల తయారీలో పరిశుభ్రత పాటించాలని, నాణ్యమైన పదార్థాలను ఉపయోగించాలని సూచించారు. పార్లర్ యజమానులు రాజేష్, నాయుడులు మాట్లాడుతూ తమ పార్లర్ లో అతి తక్కువ ధరలకే నగర ప్రజలకు అన్ని ఆహార పదార్థాలు అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో ఇండోస్టార్ సంస్థ బ్రాంచ్ మేనేజర్ వర్షం వెంకట్, వైకాపా ఈస్ట్ గోదావరి నాయకులు ప్రశాంత కుమార్, పోతిన శివ, ఆదిశేషయ్య, సత్యప్రసాద్, అలీ, చిన్ని తదితరులు పాల్గొని రాజేష్, జె. ఏ. నాయుడులకు పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు.

# విఎంఆర్డిఏ అధ్వర్యంలో 8,9 తేదీలలో పోటీలు

## సుమారు 3 వేల మంది విద్యార్థులు నమోదు

## విఎంఆర్డిఏ కమిషనర్ పి. కోటేశ్వర రావు



సిరిపురం: బాలల దినోత్సవం సందర్భంగా విఎంఆర్డిఏ ఆధ్వర్యంలో ఈ నెల 8, 9 తేదీలలో నిర్వహించు పలు పోటీలకు గాను సుమారు 3 వేల మంది విధ్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నారని విఎంఆర్డిఏ మెట్రోపాలిటన్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తేదీన ఉదయం 10 గంటల నుండి బాలల ప్రాంగణం లో స్పెల్ బీ, క్విజ్, వక్తృత్వం పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. స్పెల్ బీ , క్విజ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో జరుగుతుందని, వక్తృత్వం ప్లాస్టిక్ రహిత విశాఖ బీచ్ క్లీనింగ్ పై ప్రత్యేక దృష్టి అనే అంశంపై (తెలుగు లేదా ఇంగ్లీష్ లో) సీనియర్ విభాగంలోనే జరుగుతుందని స్పష్టం చేశారు. 9వ తేదీన ఉదయం 10 గంటల నుండి వ్యాసరచన, డ్రాయింగ్, గ్రూప్ డాన్స్ (జానపద, సెమీ క్లాసికల్) పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వ్యాసరచన కోసం కాగితాలను సరఫరా చేయడం జరుగుతుందని, పెన్ను, రైటింగ్ పాడ్ అభ్యర్థులే తెచ్చుకోవలసి ఉంటుందని, సోషల్ మీడియా దాని ప్రభావం అనే అంశం పై తెలుగు లేదా ఇంగ్లీష్ భాషలలో రాయవచ్చని, కాల పరిమితి అర్ధ గంట ఉంటుందన్నారు. డ్రాయింగ్ కు సంబంధించి విశాఖ అందాలు అనే అంశం పై జూనియర్, సీనియర్ విభాగాలలో జరుగుతుందని, డ్రాయింగ్ షీట్లను సరఫరా చేస్తామని, ఇతర రంగులు పాడ్ లు అభ్యర్థులే తెచ్చుకోవాలని సమయం గంటన్నర ఉంటుందని తెలిపారు. గ్రూప్ డాన్స్ కోసం వచ్చేవారు మేకప్ తో 10 గంటలకు గురజాడ కళాక్షేత్రం వద్ద ఉండాలని అన్నారు. ఒక గ్రూప్ నందు 10 మందికి మించి ఉండరాదని, 5 నిమిషాల లోపే డాన్స్ ముగించాల్సి ఉంటుందని అన్నారు. రెండు రోజులూ ఈ పోటీలన్నీ ఒకే సమయం లో జరుగుతాయి కావున ఒక విద్యార్థి ఒక రోజున ఒకే పోటీలో పాల్గొనే అవకాశం కలదని స్పష్టం చేశారు. ఈ నెల 14వ తేదీన మధ్యాహ్నం 3 గంటల నుండి జరుగు ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతుల ప్రదానం, పార్టీసీపెంట్స్ కు కేర్టిఫికెట్లు అందజేయడం జరుగుతుందని తెలిపారు.

# వై.యస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించిన వై.యస్.ప్రజా సంకల్పయాత్ర చరిత్రలో నిలిచిపోతుంది



విశాఖపట్నం : ప్రజా సంకల్ప యాత్రకు రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రజలకోసం ఎందాకైనా పోరాడే నాయకుడు, ఆంధ్రప్రజల గుండెచప్పుడు ముఖ్యమంత్రి వై.యస్.జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆంధ్రాయూనివర్శిటీ వై.యస్.ఆర్. విగ్రహానికి పూలమాల వేసి, కేక్ కటింగ్ కార్యక్రమాన్ని వై.యస్.ఆర్. విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.

ప్రభుత్వ పాఠశాలల పరిస్థితిని, విద్యావిధానాన్ని పాదయాత్రలో క్షుణ్ణంగా పరిశీలించటం వలన డ్రాపౌట్స్ నిర్మూలించడానికి, బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి దేశంలోనే ఎక్కడాలేని విధంగా అమ్మఒడి కార్యక్రమాన్ని తీసుకొనిరావడం జరిగింది. గ్రామ వ్యవస్థ దేశానికి గాని రాష్ట్రానికి, పల్లెలే పట్టుకొమ్మలు అనే గాంధీజీ సిద్ధాంతాన్ని నమ్మి పాదయాత్రలలోనే గ్రామాల యొక్క నిరుద్యోగతను నిర్మూలించడానికి పథకాలు ప్రజల వద్దకు వెళ్ళడానికి గ్రామ సచివాలయం అనే వినూత్నమైన కార్యక్రమాన్ని ఈ పాదయాత్ర ద్వారానే రూపొందించడం జరిగింది. ఆ సచివాలయ వాలంటరీ వ్యవస్థ ద్వారా 4 లక్షల ఉద్యోగాలు ఒకే నోటిఫికేషన్, దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఇవ్వటం జరిగింది. రైతు భరోసా కార్మిక బీమా యోజన, పూర్తిస్థాయి ఫీజు రీఎంబర్స్‌మెంట్, కౌలు రైతులకు రైతు భరోసా, ఆరోగ్యశ్రీ ఇతర రాష్ట్రాలలో కూడా ప్రవేశ పెట్టడం జరిగింది. ఇంకా అనేక సంక్షేమ పథకాలు ఈ యొక్క ప్రజాసంకల్ప యాత్ర ద్వారా వాటిని సూచించడం జరిగింది. ఈ నేపథ్యంలో యువత, విద్యార్థులు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వై.యస్.ఆర్. విద్యార్థి విభాగం పార్లమెంట్ అధ్యక్షులు బి.కాంతారావు ఏ.యూ. అధ్యక్షులు బి.మోహన్‌బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, కార్యదర్శులు: ఎమ్.కళ్యాణ్, బి.జోగారావు, విద్యార్థి నాయకులు: సిహెచ్.క్రాంతికిరణ్, రంజిత్, నిషేక్, వెంకటేష్, అఖిల్, సంజయ్, పవన్, కిరణ్, భరత్, మల్లేశ్వరరెడ్డి, రాజేష్, ఆర్.కె. ఉదయ్, కుమార్, లీలాకృష్ణ మరియు ట్రేడ్ యూనియన్ నాయకులు యస్.కె.బాబా, లక్ష్మణ్‌రెడ్డి, త్రినాధ్‌రెడ్డి, రమణ మరియు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## చెత్త విభజన, డోర్ - టు - డోర్ కలెక్షన్ శతశాతం సాధనకు

# వంద రోజుల కార్యాచరణ రూపొందించాలి

*- సిడిఎంఎ జి.ఎస్.ఆర్.కె.ఆర్. విజయకుమార్*



విశాఖపట్నం : చెత్త విభజన, ఇంటింటి నుండి చెత్త సేకరణ శత శాతం సాధనకు అన్ని మున్సిపాలిటీలు వంద రోజుల కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని కమిషనర్ & డైరెక్టర్ మున్సిపల్ పరిపాలన జి.ఎస్.ఆర్.కె.ఆర్. విజయకుమార్ పేర్కొన్నారు. జి.వి.ఎం.సి. కాన్ఫరెన్స్ హాల్‌లో నాలుగు జిల్లాల ప్రాంతీయ సమావేశానికి బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరైనారు. గౌరవ గ్రీన్ ట్రిబ్యునల్ డైరెక్షన్స్ ప్రకారం తు.చ. తప్పకుండా వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్ అమలు చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని కోరారు. శానిటేషన్, సోర్స్ సెగ్రిగేషన్ శతశాతం నిర్వహించి వాహనాల ద్వారా రవాణా చేయాలని సూచించారు. అదేవిధంగా బల్క్ వేస్ట్ జనరేటర్స్, హోం కంపోస్టింగ్‌ను వారిచేత నిర్వహింపజేయాలని ఆదేశించారు. ప్లాస్టిక్ వేస్ట్, కన్‌స్ట్రక్షన్ & డిమాలిషన్ వేస్ట్ నిర్వహించడం ద్వారా స్వచ్ఛతకు దోహదపడాలని కోరారు. డంపింగ్ యార్డులలో బయోమైనింగ్ ద్వారా లీగసీ వేస్ట్‌ను తొలగించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు సంచాలకులు పి.ఆశాజ్యోతి, సంయుక్త సంచాలకులు పూర్ణచంద్రరావులు గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు, మున్సిపాలిటీలు నిర్వర్తించవలసిన కార్యక్రమాలను గురించి కూలంకషంగా వివరించారు.

జివిఎంసి కమిషనర్ డా॥ జి.సృజన, రాజమండ్రి కమిషనర్ అభిషేక్ కిషోర్, కాకినాడ కమిషనర్ రమేష్, సహాయ కలెక్టరు ప్రతిష్ఠ, అదనపు కమిషనర్ నాగనరసింహారావు, ఎ.వి.రమణ, సన్యాసిరావు, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన మున్సిపల్ కమిషనర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# దాతల ఔదార్యంతో దివ్యాంగులకు చేయూత



అచ్యుతాపురం : దాతలు ఔదార్యంతో దివ్యాంగులకు చేయూత లభిస్తుందని స్థానిక ఇంటిగ్రెటెడ్ వికలాంగుల ఆశ్రమ పాఠశాల వ్యవస్థాపకులు పి ఎస్ టి పట్నాయిక్ అన్నారు విపిఎల్ కంపెనీ డైరెక్టర్ గ్రంధి రాజేష్ తన తల్లి గ్రంధి సీతారత్నం జ్ఞాపకార్థంగా వికలాంగుల ఆశ్రమ పాఠశాల దివ్యాంగ విద్యార్థులకు , ఉపాధ్యాయులకు 10 మంచాలు ,పరుపులు ,దిండులు ,దుప్పటలు అందజేశారు.

విజయభాను

## సంపాదకీయం

### మంటల్లో మానవత్వం

విధి నిర్వహణలో ఉన్న ఓ అధికారి పట్టపగలే దారుణహత్యకు గురికావటం హృదయ విదారకం. తనకు న్యాయం దక్కటం లేదన్న నిరాశా నిస్పృహ, చట్టపరిధిలో భూ వివాదాన్ని ఎలా పరిష్కరించుకోవాలో తెలియని మూర్ఖత్వం, క్షణికావేశం ఒకరిని హంతకుడిగా మార్చింది. ఈ వివాదంతో ఏ సంబంధం లేని అధికారిణి ప్రాణం పోయింది. చట్టంలోని లొసుగులు, అధికార ధనబలంతో తిమ్మిని బమ్మిని చేసి అన్నింటినీ పాదాక్రాంతం చేసుకోవాలనే దురాశాపరుల చిక్కుముళ్లలో చట్ట పరిధిలో పనిచేసుకుంటూ పోయే అధికారిణి విజయారెడ్డి బలికావటం తీవ్ర విషాదం. తాసిల్దార్ విజయారెడ్డి హత్య గుండెలో తడి ఉన్న ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన హేయమైన చర్య. విజయారెడ్డిని రక్షించబోయిన డ్రైవర్ మంటల్లో తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయారు. అటెండర్ తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇంతటి అఘాయిత్యానికి పాల్ప డిన నిందితుడు సురేశ్ కూడా అరవై శాతం కాలిన గాయాలతో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ ఘోర ఉదంతంలో ఎవరికీ న్యాయం దక్కింది లేదు. కానీ మానవత్వం మాత్రం మంటల్లో కాలి బూడిదైంది. గ్రామీణ నిరుపేద రైతులకు అండగా ఉండాల్సిన రక్షిత కౌలుదారి చట్టం పేదలకే ఉరితాడుగా మారింది. విజయారెడ్డి దారుణ హత్యోదంతానికి తాజా ఉదాహరణే బాచారం భూ వివాదం. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గౌరెల్లి గ్రామానికి చెందిన రైతులకు బాచారం గ్రామ పరిధిలో భూములున్నాయి. కూర దుర్గయ్య అనే రైతు పేర సర్వేనెం-96లో 5 ఎకరాల 37 గుంటల భూమి ఉన్నది. ఈ భూమి ఆయన తండ్రి వెంకయ్య నుంచి వారసత్వంగా వచ్చినట్లు దస్తావేజులున్నాయి. వెంకయ్యకు ఇద్దరు కొడుకులు దుర్గయ్య, కృష్ణ. ఈ కృష్ణ కొడుకే తాజా ఘటనలో నిందితుడు సురేశ్. ఈ భూమిని రాజా ఆనందరావు నుంచి 1954లో కొనుగోలు చేసి హక్కులు పొందారు. 1996 ఆర్‌వోఆర్ చట్టం కింద పట్టా పాసుపుస్తకాలు పొందారు. రెవెన్యూ రికార్డుల్లోనూ పట్టా, సాగుదారులుగా కొనసాగుతున్నారు. ఓఆర్ఆర్ నిర్మాణంలో నష్టపోయిన భూమికి పరిహారం కూడా పొందారు. అయితే రక్షిత కౌలుదారు హక్కుచట్టం-1950 వారి పాలిట శాపంగా మారింది. 2014లో కౌలుదారు చట్టం కింద తమకు హక్కులున్నాయంటూ అహ్మద్ హయ త్, మరికొందరు తెరమీదికి వచ్చారు. ఆ భూమి తమదేనంటూ రంగారెడ్డి జాయింట్ కలెక్టర్ నుంచి రైతులకు నోటీసులు పంపారు. సంయు క్త కలెక్టర్ ఆదేశాల మేరకు హయత్‌నగర్ ఆర్డీవో విచారణ చేపట్టి కౌలు చట్టం ప్రకారం అహ్మద్ హయత్, తదితరులకే భూమిపై హక్కులు కల్పి స్తూ ఆదేశాలు జారీచేశారు. దీనిపై రైతులు హైకోర్టుకు వెళ్లారు. కేసు హైకోర్టులో ఉండగానే, అహ్మద్ హయత్ మరో అడుగు ముందుకేసి దాన్ని గుండ్లపోచంపెల్లికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారుల కు అమ్మాడు. తరతరాలుగా వారసత్వ ఆస్తిగా సంక్రమించిన భూమి కండ్లముందే రియల్ ఎస్టేట్ వ్యాపారుల పాలయి చేతులు మారుతున్న తీరుతో రైతులు తీవ్రంగా కలత చెందారు. నిందితుడు సురేశ్ హైకోర్టు నుంచే నేరుగా తాసిల్దార్ ఆఫీసుకు వచ్చి ఈ దురాగతానికి పాల్పడినట్లు తెలుస్తున్నది. సరిగ్గా ఇదే సమయంలో నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం జాలోని గూడెంకు చెంది న ఓ మహిళ తన ముగ్గురు పిల్లలతో నల్లగొండ కలెక్టరేట్‌లో ఆత్మహత్యాయత్నం చేసింది. భర్త చనిపోయిన తర్వాత తన మూడున్నర ఎకరాల భూమిని కొందరు కబ్జా చేశారని తనకు న్యాయం చేయాలని ఆ మహిళ పిల్లలతో సహా ప్రాణాలు తీసుకోవటానికి సిద్ధపడింది. ఈ ఘటనలు భూ ఆక్రమణదారుల దురాగతాలకు అద్దం పడుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అవతరణ తర్వాత చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రవ్యాప్తంగా భూముల ధరలు పెరిగిపోయాయి. ముఖ్యంగా హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని భూములు బంగారం కన్నా విలువైనవిగా మారిపోయాయి. ఈ పరిస్థితే అనేక వివా దాలకు కారణమవుతున్నది. ఎకరం భూమి కోట్లలో పలుకుతుండటంతో ధన మదాంధులు, అక్రమార్కులు అమాయక పేదల భూములపై కన్నేస్తున్నారు. ధన బలంతో అధికారులను లోబర్చుకొని లేని లిటిగేషన్లు సృష్టించి అమాయకుల భూములను కాజేయజూస్తున్నారు. ఈ పరిస్థితుల్లోం చే రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర భూ రికార్డుల ప్రక్షాళన చేపట్టి భూ వివాదాలకు చెక్ పెట్టేందుకు కృషి చేసింది. ఏ సమస్యకైనా ఓ పరిష్కారం ఉంటుంది. జరిగిన తప్పులకు ఏ ఒక్కరినో నిందించటం కాకుండా వ్యవస్థాగతంగా పారదర్శకంగా, నిబద్ధతతో వ్యవహరించినప్పుడు అనేక సమస్యలను పరిష్కరించవచ్చు. ముఖ్యంగా భూ వివాదాలు తలెత్తినప్పుడు చట్టపరిధిలో అధికారుల పరిధి, పర్యవసానాలను ప్రజలకు సావధానంగా వివరించాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులది. బాచా రం భూ వివాదం ఉదంతంలో రైతులు ఎదుర్కొన్న పరిస్థితులను ఉదాసీనతతో కొట్టి పారేయలేనివి. గ్రామీణ నిరుపేద రైతులు ధనభలం ఉన్నవాడితో కోర్టులలో సుదీర్ఘ పోరాటం చేసి గెలువలేని స్థితి ఉన్నదన్న సత్యాన్ని కాదనలేం.

# స్పందన అర్జీదారులను చిరునవ్వుతో పలకరించాలి

- స్పందన అర్జీల పరిష్కారంలో నాణ్యత ఉండాలి
- స్పందన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే ఏ స్థాయిలో ఉన్నా కఠిన చర్యలు
- స్పందన విధి విధానాలపై జిల్లా, మున్సిపల్, మండల స్థాయి అధికారుల అవగాహనా సదస్సులో వెల్లడించిన రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు

సదస్సులో పాల్గొన్న విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాల అధికారులు






విశాఖపట్నం : స్పందన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే ఏ స్థాయిలో ఉన్నా కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు వెల్లడించారు. స్పందన అర్జీలు పరిష్కారం, విధి, విధానాలపై మంగళవారం బీచ్ రోడ్ లోని ఆంధ్రా యూనివర్సిటీ కన్వెన్షన్ హాలులో విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాలకు సంబంధించిన అధికారులతో సదస్సు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో అందే వినతులను నాణ్యతతో పరిష్కరించేందుకు అవసరమైన విధి, విధానాలను ఖరారుచేసింది. ఆ విధి, విధానాలపై జిల్లా, మున్సిపల్, మండల స్థాయి అధికారులకు అవగాహన కల్పించేందుకు ముఖ్యమంత్రి కార్యాలయం కార్యదర్శి సాల్మన్ ఆరోఖ్యరాజ్, ప్రత్యేక అధికారి డా. హరికృష్ణ, పురపాలక శాఖ కమిషనర్ జి.ఎస్.ఆర్.కె.ఆర్. విజయకుమార్, పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ అరుణ్ కుమార్, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్, తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ డి. మురళీకృష్ణ, విశాఖ నగర పోలీసు కమీషనర్ రాజీవ్ కుమార్ మీనా, విశాఖ జిల్లా ఎస్.పి. అట్టాడ బాపూజి, రాజమహేంద్రవరం పట్టణ ఎస్.పి. డా. షెముషి బాజ్పాయ్, తదితరులు సదస్సును ప్రారంభించారు.

ముఖ్యమంత్రి కార్యాయం కార్యదర్శి సాల్మన్ ఆరోఖ్యరాజ్, తదితరులు మాట్లాడుతూ ప్రజల హృదయ స్పందనకు అనుగుణంగా అధికారుల స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశ్యంతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. అయితే స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీల పరిష్కరణలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ, చొరవ చూపకపోవడంతో వాటిలో చాలా వరకు అపరిష్కృతంగానే మిగిలిపోతున్నాయనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించినట్లు తెలిపారు. స్పందన అర్జీల పరిష్కారంపై ప్రభుత్వం ఈ మద్య కాలంలో నిర్వహించిన పలు సర్వేల్లో పలు ఆసక్తికరమైన విషయాలు వెల్లడైనట్లు వారు తెలిపారు. వినతుల స్వీకరణ, విచారణ, పరిష్కరణ, తిరస్కరణ, తదితర అంశాల్లో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల తీరు అసంతృప్తి కరంగా ఉన్నట్లు ఆ సర్వేల్లో వెల్లడైనట్లు వారు తెలిపారు. ప్రజల నుండి అర్జీల స్వీకరించేటప్పుడు నవ్వుతో స్వీకరించాలని, ఆ విధంగా చేస్తే అర్జీదారుల్లో ఆత్మస్థైర్యం పెంపుందుతుందని పేర్కొన్నారు. కొన్ని అర్జీల సమస్యల పరిష్కారం జరిగినప్పటికీ మరికొన్ని సమస్యలను సహేతుక కారణాలు చూపకుండా తిరస్కరించడం జరుగుచున్నట్లు గుర్తించడమైందన్నారు.

ఇటు వంటి సమస్యలను అన్నింటినీ పరిష్కరించేందుకు, వినతుల పరిష్కారంలో అధికారులు అనుసరించాల్సిన విధి, విధానాలను ప్రభుత్వం ఖరారు చేసినట్లు వారు తెలిపారు. ఈ విధి, విధానాలపై జిల్లా, మండల స్థాయి అధికారులు అందరూ అగాహన పెంచుకొని స్పందన అర్జీల పరిష్కారంలో మంచి ప్రతిభ చూపాలని వారు సూచించారు. స్పందన అర్జీల పరిష్కారంలో ఇకపై ఎటు వంటి ఫిర్యాదులు వచ్చినా ప్రభుత్వం ఉపేక్షించదనే సంకేతాలను అధికారులకు వారు ఇచ్చారు.

ముఖ్యమంత్రి కార్యాయం కార్యదర్శి సాల్మన్ ఆరోఖ్యరాజ్ మాట్లాడుతూ అర్జీలను అందజేసేందుకు వచ్చే ప్రజలను చిరునవ్వుతో ఆహ్వానించి, గౌరవాధరణలతో మాట్లాడాలని అధికారులకు సూచించారు. తీసుకున్న అర్జీకి రశీదు ఇవ్వాలని, అందిన వినతులను క్షణ్ణంగా పరిశీలించి, సమగ్రమైన విచారణ చేసి అర్జీపై తీసుకున్న నిర్ణయాన్ని ఎండార్స్ మెంట్ అర్జీదారునికి అందజేయాలన్నారు. అర్జీ ఒక సమస్యకు పెట్టుకుంటే వేరొక సమస్యకు అప్ లోడ్ చేస్తున్నారని, ఆ విధంగా చేయకుండా ఏ సమస్యపై అర్జీదారు పెట్టుకుంటే అదే సమస్యకు రశీదు ఇవ్వాలని చెప్పారు. ప్రతీ విషయంపై క్షుణ్ణంగా పరిశీలించి సమస్య పరిష్కరించాలని తెలిపారు. ప్రభుత్వ పథకాలు పొందేందుకు వారు అర్హులు అయితే వెంటనే లబ్ది చేకూర్చాలని సూచించారు. ఒక వేళ అనర్హులు అయితే అందుకు సహేతుకమైన కారణాలను చూపుతూ సున్నితంగా అర్జీని తిరస్కరించాలన్నారు. ఇందుకు అనుసరించాల్సిన విధి, విధానాలను ప్రభుత్వం ఖరారు చేసిందని, అధికారులు వాటిని తూ.చా తప్పక పాటిస్తూ స్పందన అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలన్నారు.

డిశంబరు లేదా జనవరి నెల నుండి వ్యవస్థలో మార్పు చేసి ప్రజలకు మంచి సేవలు అందించాలని ఆయన అధికారులను కోరారు.

ముఖ్యమంత్రి కార్యాలయం ప్రత్యేక అధికారి డా.హరికృష్ణ రాష్ట్ర ముఖ్యమంత్రి గతంలో నిర్వహించిన పాదయాత్రలో ఎన్నో అర్జీలు వచ్చాయని, అధికారంలోకి వచ్చిన

వెంటనే అర్జీల సమస్యలను పరిష్కించే వేదిక ఉండాలనుకున్నారని చెప్పారు. ప్రజా వినతులను నాణ్యతతో పరిష్కరిస్తే ప్రజలకు ప్రభుత్వం పై విశ్వాసం పెరుగుతుందని, అలక్ష్యం వహిస్తే విశ్వాసం తగ్గుతుందన్నారు. అర్జీలు 80 శాతం పరిష్కారం జరిగాయని, దీనిపై ప్రభుత్వం సర్వే చేయగా అర్జీల పరిష్కారంలో నాణ్యత లేదని తేలినట్లు ముఖ్యమంత్రి దృష్టికి వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

అర్జీ సమస్య ఒకటైతే వేరొక సమస్యలపై అప్ లోడ్ చేస్తున్నట్లు ఆయన వివరించారు. ముఖ్యమంత్రి ఈ సమస్యను అధిగమించేందుకే రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో ఒక సమావేశం ఏర్పాటు చేసి వారి సూచనలు స్వీకరించి వాటిలో ప్రజలకు నాణ్యమైనవో వాటిని గుర్తించి, స్పందన అర్జీల పరిష్కారంలో ప్రభుత్వం విధి, విదానాలను రూపొందించిందని, వాటిని పాటించి స్పందన అర్జీలను సంతృప్తికర స్థాయిలో పరిష్కరించి ప్రజలకు మంచి సేవలు అందించాలని అధికారులను ఆయన కోరారు.

పురపాలక శాఖ కమిషనర్ జి.ఎస్.ఆర్.కె.ఆర్.విజయకుమార్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలోని లోపాలను సరిదిద్దడం కోసమే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మండల స్థాయిలో వివిధ సమస్యలపై అర్జీలు వస్తాయని, అక్కడ పరిష్కారం కాకపోతే జిల్లా స్థాయి స్పందనకు వస్తాయని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి సమస్య పరిష్కారం జరిగితే పరిష్కరించాలని, పరిష్కారం జరుగకపోతే నాణ్యమైన సమాధానం అర్జీదారునికి చెప్పాలని వివరించారు.

నవ్వుతూ అర్జీని స్వీకరించాలని, నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. స్పందన అర్జీల పరిష్కారంలో ఉద్యోగుల నిబద్ధత లోపించడవం వల్లే ప్రజలు అసంతృప్తిని వ్యక్తంచేస్తున్నారన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మక కార్యక్రమం అయిన స్పందన కార్యక్రమానికి అధికారులు, సిబ్బంది అత్యంత ప్రాధాన్యత నివ్వాలని, స్పందన అర్జీల పరిష్కారంతో నాణ్యతను చూపాలన్నారు. ఈ సదస్సు అనంతరం కూడా అధికారులు, సిబ్బంది పనితీరులో మార్పురాకుంటే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

స్పందన అర్జీల పరిష్కారంపై ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తో క్షుణ్ణంగా వివరించారు.

పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ అరుణ్ బాబు మాట్లాడుతూ రేషన్ కార్డులకు సంబందించిన అర్జీలపైన, సెర్ప్ సి.ఇ.ఓ. పి. రాజ బాబు పించన్ల అర్జీలపైన, రెవిన్యూ శాఖ అధికారి వెట్రిసెల్వి భూ సంబంధమైన అర్జీలపైన, పోలీస్ అధికారి శాంతి, భద్రతల సమస్యల అర్జీల పరిష్కారానికి అనుసరించాల్సిన విధి, విధానాలను పవ్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ లు నిర్వహిస్తున్నారని, నివేదికలు తెప్పించుకొని వాటిపై సమీక్షిస్తున్నారని చెప్పారు.

తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ డి. మురళికృష్ణ మాట్లాడుతూ అర్జీలు ఎన్ని పరిష్కరించారనేది ముఖ్యము కాదని, ఎంత నాణ్యతతో అర్జీల సమస్యలు పరిష్కరించామనేది కావాలన్నారు. అర్జీ దారులు చాలా దూరం నుండి వస్తుంటారని, వారి సమస్యలు పరిష్కరించాల్సిన అవసర ఉందన్నారు. ప్రతి జిల్లా, మండల స్థాయి అధికారులు స్పందన కార్యక్రమం నిర్వహణ జరుగుతుందని, ఇందులో ఏ ప్రాంతంలో మంచి పరిపాలన ఉన్నదో తెలుసుకొని రాష్ట్ర స్థాయిలో ఆ విధానంను అమలు చేయాలని చెప్పారు.

ఈ కార్యక్రమంలో నగర పోలీసు కమీషనర్ రాజీవ్ కుమార్ మీనా మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో వస్తున్న అర్జీలను పరిష్కరిస్తున్నామన్నారు. నగరంలో ఎక్కువగా భూ సమస్యలపై వస్తున్నాయని, వాటిని సంబంధిత తహసిల్దార్ లకు పంపుతున్నామని చెప్పారు.

భూ ఆక్రమణలకు సంబంధించి ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇందులో భూ సమస్యలకు సంబంధించిన అర్జీలను పెట్టుకుంటున్నట్లు వివరించారు. కొంత మంది అధికారులు వారికి ఉన్న అనుమానాలను రాష్ట్ర స్థాయి అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు.

ఈ సదస్సులో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎల్. శివ శంకర్, తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ లక్ష్మీషా, జివియంసి కమీషనర్ డా.జి. సృజన, పాడేరు ఐటిడిఎ పిఓ డికె బాలాజి, సబ్ కలెక్టర్ వెంకటేష్, డి.ఆర్.ఓ. ఎం. శ్రీదేవి, విశాఖపట్నం ఆర్డిఓ పెంచల కిషోర్, తదితరులతో పాటు విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన జిల్లా అధికారులు, తహసిల్దార్లు, మండల అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, డీఎస్పీలు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, తదితరులు ఈ సదస్సులో పాల్గొన్నారు.








## టీవీ మీదపడటంతో చిన్నారి మృతి



శ్రీకాకుళం: పలాస - కాశీబుగ్గ న్యూ కాలనీలో విషాదం చోటుచేసుకుంది. టీవీ మీదపడటంతో ఏడాది బాలిక మోహరిణి (1) మృతి చెందింది. చిన్నారి ఇంట్లో ఆడుకుంటూ కేబుల్ వైరు లాగడంతో టీవీ మీదపడింది. తీవ్ర రక్తస్రావం జరగడంతో ఆస్పత్రిలో చిన్నారి కన్నుమూసింది. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.



గ్రేటర్ విశాఖ 27వ వార్డు సూర్యాబాగ్‌లో ఉన్న బోర్‌వెల్ పనిచేయడం లేదంటూ స్థానిక ప్రజలిచ్చిన మాజీ కార్పొరేటర్, 27వ వార్డు వానపల్లి రవికుమార్‌కు ప్రజలు ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన జివిఎంసి వార్డు వాటర్ వర్క్స్ సిబ్బందితో మరమ్మతులు చేయించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. అందుకు అందరూ కృతజ్ఞతలు తెలిపారు.

## రియల్టీ రంగానికి భారీ ఊరట

న్యూఢిల్లీ: రియల్టీ రంగానికి కేంద్ర ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. రియల్ ఎస్టేట్ రంగంలో జోష్ నింపేందుకు పలు కీలక నిర్ణయాలు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం వెల్లడించారు. దీని ప్రకారం ఎన్‌పీఏ ఎన్‌సీఎల్‌టీ ప్రకటించిన సంస్థలకు మాత్రమే అనే నిబంధనను తాజాగా తొలగించారు. తద్వారా మధ్య, చిన్న ఆదాయ రియల్టీ ప్రాజెక్టులకు, సగంలో నిలిచిపోయి పూర్తి కాని ప్రాజెక్టులకు కేంద్రం నిధులను సమకూరుస్తుంది. తద్వారా సంబంధిత ప్రాజెక్ట్ పూర్తి కావడానికి సాయపడుతుంది. ఇందుకోసం రూ .25 వేల కోట్ల విలువైన ప్రత్యామ్నాయ పెట్టుబడి నిధిని (ఎఐఎఫ్) ఏర్పాటు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ తెలిపారు.

రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

**CHANGE OF NAME**

Forwarded AJJAMPUDI VENKATA RAMANAMMA (Old name) W/o. AJJAMPUDI KOTA NAGAIAH, R/O.16-146, Srinivasa nagar, Simhachalam road, Visakhapatnam, changing my name from AJJAMPUDI VENKATA RAMANAMMA (Old name) to AJJAMPUDI VENKATA RAMAMMA (NEW NAME), W/O. AJJAMPUDI KOTA NAGAIAH, henceforth I am being called as **AJJAMPUDI VENKATA RAMAMMA** (NEW NAME) For all purposes.

**CHANGE OF NAME**

LAKSHMI TATAPUDI W/o. VENKATARAO TATAPUDI (Old name), R/0.57-24-45, Tummadapalm, Urvasi Jn, Kancharapalem, Visakhapatnam-530008, changing my name from LAKSHMI TATAPUDI W/o, VENKATA RAO TATAPUDI (Old name) to LAKSHMI TATAPOODY W/0, VENKATA RAO TATAPOODY (NEW NAME), henceforth I am being called as **LAKSHMI TATAPOODY W/O. VENKATA RAO TATAPOODY (NEW NAME)** For all purposes.

**CHANGE OF NAME**

I, KOTTA RAGHU (Old Name) S/O KOTTA SURYA PRAKASA RAO Residing at D.NO. 7-9-4, MG ROAD, NEAR CLOCK TOWER, VIZIANAGARAM, AP changing my name from KOTTA RAGHU (OLD Name) to KOTTA RAGHU RAM (New Name) S/O KOTTA SURYA PRAKASA RAO henceforth I am being called as **KOTTA RAGHU RAM** (New Name) for all purposes.

**CHANGE OF NAME**

I, GOKAVARAPU RAMA LAKSHMI (Old Name) W/O GOKAVARAPU KRISHNA RAO, Residing at D.NO. 7-9-4, MG ROAD, NEAR CLOCK TOWER, VIZIANAGARAM, AP changing my name from GOKAVARAPU RAMA LAKSHMI (OLD Name) to GOKAVARAPU RAJYALAKSHMI (New Name) W/O GOKAVARAPU KRISHNA RAO henceforth I am being called as **GOKAVARAPU RAJYALAKSHMI** (New Name) for all purposes.

## నవంబర్ 26న జరగబోయే
## 'రాజ్యాంగ దినోత్సవం' బహిరంగ సదస్సును విజయవంతం చేయాలి



ఎస్.రాయవరం : నవంబర్ 26వ తేదీన జరగబోయే 'రాజ్యాంగ దినోత్సవాన్ని' పురస్కరించుకుని సామాజిక న్యాయం రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం జరిగే బహిరంగ సదస్సు విజయవంతం చేయాలని బుధవారం జరిగిన సభలో విశాఖపట్నం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటు మరియు ప్రముఖ న్యాయవాది జె.సి.రామకృష్ణ సభ అధ్యక్షత వహించి రాజ్యాంగ దినోత్సవం కార్యక్రమానికి దళిత బహుజనులు అందరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన డిబిఎస్ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ మాట్లాడుతూ బాబా సాహెబ్ డా.బి.ఆర్.అంబేద్కర్ ఆలోచన విధానాన్ని ఆశయసాధనను ప్రతి దళిత యువత ఆచరించాలని కోరారు. అనంతరం పోస్టర్స్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డిబిఎస్.ఇన్‌ఛార్జి సాకా రాధాకృష్ణ, దళిత నాయకులు డి.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# గిఫ్ట్‌షాప్ ప్రారంభం



విశాఖసిటీ : విశాఖ ఉత్తర నియోజకవర్గం 39వ వార్డు, వుడాకోలని, విజేత సూపర్ మార్కెట్ ఎదురుగా షాప్ ఇన్ షాపీ గిఫ్ట్ షాప్ ఓపెనింగ్ కార్యక్రమంలో...

ముఖ్య అతిధిగా పాల్గొన్న శ్రీ కె.కె. రాజు ఈ కార్యక్రమంలో 39వ వార్డు అధ్యక్షురాలు పి.సునీత, పైడి శ్రీను, పైడి ప్రతాప్, విశ్వనాధరాజు, దమయంతి, పి.చంద్ర శేఖర్ రెడ్డి, శరత్, రాధ, రత్న, సంతోష్, 39వ వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా అజయ్‌రాజ్ జన్మదిన వేడుకులు



పరవాడ : మండలకేంద్రమైనపరవాడ మరిడిమాంబకమ్యూనిటీహాల్ లో బుధవారము పరవాడ మండలవైసిపి ఇన్ చార్జి అన్నంరెడ్డి అజయ్ రాజ్ జన్మదిన వేడుకులు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్ధానికశాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ హాజరైకేక్ కట్ చేసి తినిపించారు. అనంతరము వైసీపీ సిఇసి సభ్యులు పైల శ్రీనువాసురావు, వైసిపిజిల్లా ప్రదానకార్యదర్శి చుక్క రామునాయుడు, మండలపార్టిప్రెసిడెంట్ సిరపురపు అప్పలనాయుడు,ఎఫ్ సి ఐ మెంబర్ పైలసన్యాశిరావు,55వవార్డు వైసిపి అద్యక్షులు బట్టుసన్యాశిరావు కలిసి అజయ్ రాజ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# అర్హులందరికీ రైతుభరోసా పథకం
## వర్తింపజేయడమే ప్రభుత్వ లక్ష్యం
### అనంతగిరి మండల వ్యవసాయ అధికారిణి పావని



అనంతగిరి : మండలంలో గల 24 పంచాయతీల రైతులకు రైతు భరోసా కింద 9050 ఖాతా నెంబర్లు ఉన్నాయని అందులో 5814 ఖాతాలకు రైతు భరోసా పథకం మంజూరు అయిందని అందులో 43 43 ఖాతాలు డబ్బులు వారివారి బ్యాంకు ఖాతాలలో జమ య్యాయని 1389 ఖాతాలు వివిధ కారణాలతో తిరస్కరించడం జరిగిందని తెలిపారు మిగిలిన ఖాతాలు పెండింగ్ లో ఉన్నట్లుగా చూపిస్తుంది అని,మండల వ్యవసాయ అధికారిణి పావణి తెలిపారు.

### ప్రభుత్వ భూములా!? జిరాయతీ భూములా!?
## రెవెన్యూ అధికారులు తెలపాల్సి ఉంది
### గిరిజన సంఘం నాయకులు, కిల్లో మొసియా

అనంతగిరి : మండలంలోని భీంపోలు పంచాయతీ నందకోట రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 103. 105. 106. 109 ప్రభుత్వ భూములను 32.ఎకారాల 85 సెంట్లు భూమి జిరాయతీగ మార్చి కుచర్ల పాటి సుధాకర్ వర్మ రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై, కబ్జా చేశారని విశాఖపట్నం సీట్ అధికారులకు గిరిజన సంఘం నాయకులు జే,వెంకటరమణ, కిల్లో మొస్య, ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో భీంపోలు పంచాయతీ నందకోట రెవెన్యూ పరిధిలోని 32. 85 సెంట్లు భూమి గతంలో పనిచేసిన రెవెన్యూ అధికారులు జిరాయతీగ మార్చి రిజిస్ట్రేషన్ చేశారని, దీనిని పరిశీలించి రెవెన్యూ అధికారుల పై చర్యలు తీసుకోవాలని కోరినట్లుగా వారు పత్రికలకు తెలిపారు.

నందకోట రెవిన్యూ పరి ధిలో గల ఈ భూములు ప్రభుత్వ భూములా,? జిరాయితీ భూములా, అని తెలుసుకోవాలంటే సెటిల్ మెంట్ ఫెయిర్ అడంగల్ ఉండాలని, రెవెన్యూ రికార్డులు, సెటిల్‌మెంట్ ఫెయిర్ అడంగల్, లేక ఇటువంటి తప్పులు దొర్లు తున్నాయని సెటిల్‌మెంట్ ఫెయిర్ అడంగల్ ఉన్నట్లయిన వాస్త వాలు తెలుస్తాయి అని నంద కోట సెటిల్మెంట్ ఫెయిర్ అడంగల్ ద్వారా వాస్త వాలు తెలుస్తాయి అని ప్రజలు కోరుతున్నారు.

## భవన నిర్మాణ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

దేవరాపల్లి : భవననిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించి తక్షణమే ఆదుకోవాలని భవన నిర్మాణ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. మండల కేంద్రం దేవరాపల్లిలో బుధవారం సి పి ఐ మండల కార్యదర్శి వేమల కన్నబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని కార్మికులు పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ రాష్టంలో ఇసుక కొరత సృష్టించి భవన నిర్మాణ కార్మికులతో పాటు అనేక రంగాలలో పని చేస్తున్న కార్మికులు ఉపాధి లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆరోపిం చారు. వెంటనే ఇసుక పై చర్యలు తీసుకోని కార్మికులను ఆదుకోవాలన్నారు. అనంతరం స్థానిక డిప్యూటీ తహసీల్దార్ బి. అరుణ్ చంద్ కు వినతి పత్రం అందజేశారు.

ఈ కార్యక్రమం లో దిరిశం సత్యం, తమతపు దేముడుబాబు, వేచలపు త్రినాద్, వేమల సన్యాసినాయుడు, కొట్యాడ రవి తదితరులు పాల్గొన్నారు.



మాదిగ జైజై మాదిగ దర్శనాల భారతి అక్కకి రెండో వర్ధంతి సందర్భంగా బుధవారం నార్త్ నియోజకవర్గంలోని అర్బన్ కమిటీ వర్ధంతిని నార్త్ ఇన్‌ఛార్జిలు ఈ కార్యక్రమంలోని దొండపర్తి లక్ష్మణరావు, వెంకటరమణ, సిహెచ్.చిన్నారావు, జైకుమార్, స్మ్రాట్‌కుమార్, సబ్బవరం పి.కాతారావు, శ్రీనివాసరావు

## ఈనెల 7వతేదీన
## రాజాం మరిడిమాంబ పండగ

చీడికాడ : ఈనెల 7వతేదీన రాజాంలో మరిడిమాంబ పండగను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ ఆలయానికి రంగులు వేసి అందంగా ముస్తాబు చేశారు. ఎర్రవాయి ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన రాజాం మరిడిమాంబ అమ్మవారికి ప్రతీ ఏటా కార్తీకమాసంలో పౌర్ణమికి ముందు వచ్చే గురువారం పండుగను నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా ఘనంగా ఏర్పాటు చేశారు. యూత్ అసోసియేషన్ డిఫెన్స్ ఉద్యోగులు సహకారంతో భక్తులకు భారీ అన్నదానం చేయనున్నారు. విద్యుద్దీపాలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ హాజరు కానున్నారు.

## మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి

దేవరాపల్లి : మహిళల ఆర్థికాభివృద్ధి కోసం కృషి చేయాలని శ్రీనిధి మేనేజర్ పి.సత్తిబాబు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం మండల మహిళా సమైక్య సర్వసభ్య సమావేశం సమైక్య అధ్యక్షురాలు అల్లం నర్సమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గురించి సమీక్షా జరిపారు. అదే విధంగా శ్రీనిధి వసూళ్లు, సి ఐ ఎస్ ఫ్ నిధులు, వై ఎస్ ఆర్ క్రాంతి పథకం, వై ఎస్ ఆర్ రుణమాఫి, వడ్డీ లేని రుణాలు, బ్యాంకు లింకేజీ రుణాలపై చర్చించారు. ఎస్ హెచ్ జి గ్రూపులకు ఇస్తున్న రుణాలు, వసూళ్లు పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వెలుగు సి సి లు కె. శ్రీనివాసరావు, సత్యం నాయుడు, యు. శ్రీను, యు. ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అవంతీ పాలిటెక్నిక్ విద్యార్ధులకు శిక్షణా తరగతులు



భీమునిపట్నం : తగరపువలస అవంతీ పాలిటెక్నిక్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శిక్షణాభివృద్ధి సంస్థ వారిచే వారం రోజులు పాటు కంప్యూటర్ మరియు గూగుల్ టూల్స్ వినియోగం పై శిక్షణా తరగతులు నిర్వహిస్తారు. శిక్షణాతరగతులు ఈనెల నాలుగున కళాశాల ప్రిన్సిపాల్ ఎ.అర్జున రావు ఆద్వర్యంలో ప్రారంభిం చబడ్డాయి. ఈ శిక్షణా శిబిరం లో ప్రముఖ శిక్షకులు ఆర్ అనీష్ కుమార్ ఈ నెల తొమ్మిది వరకూ శిక్షణ ఇస్తారు. దీనికి కావాల్సిన అన్ని సౌకర్యాలు కలిపిస్తున్నామని అవంతీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్స్ పాల్ డాక్టర్ ఎస్ ఎన్ వి గణేష్ తెలిపారు. ఈ కార్యక్రమం లో కళాశాల జనరల్ సెక్రెటరీ డాక్టర్ ఎం. ప్రియాంక మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతులు ద్వారా విద్యార్థులు కంప్యూటర్ మరియు ఇంటర్ నెట్ వినియోగం లో నైపుణ్యం సాధిస్తారని ఇది విద్యార్థులకు నేడు చాల అవసరమని మిగిలిన అన్ని విబాగపు విద్యార్థులకు ఇలాంటి నైపుణ్య వంత మైన శిక్షణా తరగతులు అందజేయుటకు కళాశాల మేనేజ్ మేంట్ అన్నివిదాల సహకరిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ ఐ.శ్రావణ్‌కుమార్ వైస్‌ప్రెసిడెంట్ ఎం.నంధీష్, డైరక్టర్లు ఎ.చంద్రశేఖర్, ఎస్.రాఘవరావు, ఎటవై.శ్రావణ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

# విలేకర్లను మోసం చేసిన మాజీ ఎమ్మెల్యే పీలా

### వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు



ఆళ్ల నాగేశ్వరరావు

అనకాపల్లి : అధికారంలో ఉన్నంతకాలం విలేకర్లను పట్టించుకోని మాజీ శాసన సభ్యులు పీలా గోవింద సత్యనారయణకు పదవి పోయిన అనంతరం వారిపై ప్రేమ పుట్టుకు రావడం ఆశ్చర్యంగా ఉందని, వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు అన్నారు. స్థానిక విలేకర్లతో బుధవారం ఆయన మాట్లాడారు. విలేకర్ల సంక్షేమం గురించి పీలా గోవింద సత్య నారాయణ మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో విలేకర్లకు ఇళ్ల పట్టాలు ఇస్తామని చెప్పి రక రకాలుగా మోసగించారని గుర్తు చేశారు. ఒక్కసారి ఆదార్ కార్డు తేవాలని, మరొక సారు కోటాకార్డు ఇవ్వాలని, విలేకర్లతో ఆటలాడుకున్న సంగతిని మర్చిపోయినట్టుగా ఉందన్నారు. మీటింగ్‌లు పెట్టి వారిని మబ్బిపెట్టి మాయంచేసి, మోసం చేసిన చరిత్ర పీలాగోవిందదని అన్నారు. రేబాక వద్ద కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలను, విలేకర్లకు తెలియకుండా బినామీ పేర్లు సృష్టించి కబ్జాచేయడానికి ప్రయత్నిస్తే అందరూ ఏకమై ఆర్డీవో ఆఫీసు వద్ద దర్నా చేసి ప్రతిగటించిన సంగతి మర్చిపోయారా అంటూ నిలదీసారు. పచ్చ జెండాకు అనుకూలంగా ఉన్న పది శాతం మంది మాత్రమే మీ దృష్టిలో విలేకర్లగా భావించి మిగిలి 90 శాతం మందిని తీవ్ర నిర్లక్ష్యానికి గురిచేసిన నైజం విలేకర్లు మర్చిపోలేదన్న సంగతి గుర్తించాలన్నారు. నిజాలను నిర్భయంగా ప్రజలకు తెలియజేసేది కూడా పత్రికలేనని గుర్తించుకోవాలని ప్రపంచంలో జరిగే అన్యాయాలు అక్రమాలు ప్రజల దృష్టికి తీసుకు వెళ్లేది విలేకర్లని అలాంటి వారిని మోసం చేసిన ఘనత దక్కించుకున్న మీరు వారిపై ప్రేమ ఉన్నట్లు మీడియాపై ఆంక్షలు ఎత్తి వేయాలని, ప్రకటన చేయడం ప్రజలు నవ్వు కుంటున్నారని నాగేశ్వరరావు అన్నారు.

## మామిడిపాలెం సచివాలయాన్ని ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే



అనకాపల్లి : మండలం మామిడిపాలెంలో గ్రామ సచివాలయాన్ని బుధవారం ఎంపీ డాక్టర్ సత్యవతి, ఎమ్మెల్యే గుడి వాడ అమర్‌నాథ్ ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఏ సమస్యనైనా గ్రామ సచివాలయంలో పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వైసీపీ ప్రభుత్వం నెరవేరుస్తున్నట్లు వారు చెప్పారు. అమ్మఒడి పథకాన్ని వచ్చే జనవరి నుంచి అమలు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

## యథేచ్ఛగా సారా తయారీ...అమ్మకాలు
## పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

కోటవురట్ల : మండలంలోని పలు గ్రామాల్లో సారా తయారీ యధేచ్ఛగా సాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం బెల్టు షాపులను నిషేదించడంతో కొంత మంది వ్యాపారులు సారాను తయారు చేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు పట్టించుకవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తడపర్తి, శ్రీరాంపురం, అల్లుమియ్యపాలెం, బంద, పికెపల్లి, బోడపాలెం, నీలిగుంట, తిమ్మాపురం గ్రామాలు సారా విక్రయాలకు నిలయంగా మారాయి. అడవి ప్రాంతాల్లో సారాను తయారు చేసుకొని అక్కడ నుంచి పల్లెలకు నీటి ప్యాకెట్ల మాదిరిగా తరలిస్తున్నారు. గ్రామాల్లో వ్యాపారులు వీటిని విక్రయిస్తున్నారు. దీనిపై పోలీసులు ఎన్నిసార్లు దాడులు చేసినా వ్యాపారులు తప్పించుకుంటున్నారు. సారా విక్రయాలు అతి తక్కువ ధరకే అంటే పది రూపాయల నుంచి దొరుకుతుంది. అన్ని వేళల అందుబాటులో ఉంటుంది. దీంతో రోజు వారి కూలీలు సారాను తాగుతున్నారు. ఎక్సైజ్ అధికారులు సారా విక్రయాలపై అడపాదడపా దాడులు చేయడంతో తిరిగి అదే ప్రాంతంలో సారా బట్టీలు పెట్టడం అలవాటుగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి సారా అమ్మకాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## 10న జాతీయ కార్యధ్యక్షులు నడ్డా రాక



బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు గొంప సత్యనారాయణ

నాతవరం : ఈ నెల 10వ తేదీన బిజెపి జాతీయ కార్యధ్యక్షులు నడ్డా మొదటి సారిగా ఆంధ్రప్రదేశ్ పర్యటనకు వస్తున్నారని బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు, నర్సీపట్నం నియోజక వర్గ సోషల్ మీడియా కన్వీనర్ గొంప సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ మొఘలి రాజుపురం సిద్దార్ధ పబ్లిక్ స్కూల్‌లో సమావేశంకు ఈయన హాజరు కానున్నారన్నారు. ఈ సమావేశానికి బూత్ అధ్యక్షులు, క్రియాశీల సభ్యత్వం కలగవారు తప్పనిసరిగా రావాలన్నారు. ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు సమావేశం జరుగుతుందన్నారు.ఈ సమావేశానికి హాజరయ్యే సభ్యులు ముందస్తుగా పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. మరెన్ని వివరాలకు 98489 47642 నెంబరులో సంప్రదించాలన్నారు.

# అధ్వానంగా పెద్దూరు రహదారి



అనంతగిరి: మండలంలో గల, అనంతగిరి పంచాయతీ, పెద్దూరు నుంచి కలుపుకొని ప 10 (కిలోమీటర్లు) రహదారినకు 3 కోట్ల రూపాయలు మంజూరు చేశారు. కానీ ఇంతవరకు రహదారి పనులు పూర్తికాలేదు నిధులు మంజూరు అయిన నిర్మాణాలు చేపట్టకపోవడంతో గిరిజనులకు ఇబ్బందులు తప్పలేదు పైగా అసంపూర్తి పనులతో కొత్త చిక్కులు మొదలయ్యే మండలంలోని పంచాయతీ నుంచి పాతకోట కలుపుతూ పది కిలోమీటర్ల రింగ్ రోడ్డు నిర్మాణానికి 2017 - 18 సంవత్సరంలో అప్పటి శాసనసభ్యులు కిడారి సర్వేశ్వరరావు శంఖుస్థాపన చేసి పనులు చేపట్టారు. ఇందుకు మహాత్మా గాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో గిరిజన సంక్షేమ శాఖ నిర్వహణ బాధ్యత నిర్వర్తిస్తుంది ప్రభుత్వం సుమారు మూడు కోట్లు మంజూరు చేసింది వీటితో మొదలుపెట్టి మూడు కిలోమీటర్ల వరకు రోడ్డు వేశారు. అలాగే అసంపూర్తిగా పనులు నిలిపివేయడంతో గిరి జనులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

పెద్దూరు గ్రామ సమీపంలో చంపావతి నదిపై, 1 కోటి, రూపాయలతో చేపట్టిన వంతెన పనులు నిర్మాణంలోజాప్యం జరుగుతుండడం 14 గ్రామాలకు రాకపోకలు అంతరాయం ఏర్పడుతుంది గత రెండు నెలలుగా భారీ వర్షాలతో తాత్కాలికంగా నిర్మించిన డైవర్షన్ కల్వర్టు పోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పనులు జాప్యంతో నిర్మాణంలో ఉన్న రహదారి అంతా అస్తవ్యస్తంగా మారింది వర్షాలకు పూర్తిగా రహదారి పాడై పోవడంతో అత్యవసర వేళల్లో 108 వాహనం కూడా కాని పరిస్థితి ఏర్పడింది.

గ్రామ గ్రామంలో ఎవరైనా అనారోగ్యానికి గురైతే వారిని డోలిమోతే శరణ్యం, నాలుగు కిలోమీటర్ల దూరం డోలీతో మోసు కుంటూ తీసుకు రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది కనుక ఇప్పటి కైనా అధికారులు స్పందించి రహదారి పనులు పూర్తి చేయించి గిరిజనులకు అందుబాటులోకి తీసుకురావాలని పలు వురు గిరిజనులు ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు.

# రైతుభరోసా పథకానికి తుది గడువు 15



సబ్బవరం : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా పథకానికి అర్హులైన రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించేందుకు గడువు ఈ నెల 15 వరకు మాత్రమే ప్రభుత్వం ఇచ్చిందని స్థానిక మండల వ్యవసాయ శాఖాధికారి పోతల సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక వ్యవసాయ కేంద్రంలో వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ బుధవారం విలే కర్లతో మాట్లాడుతూ రైతు భరోసా దరఖాస్తులను తమ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసే పనిలో నిమగ్నమయ్యామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మొత్తం 24 గ్రామ పంచాయితీల పరిధిలో గల రైతులకు సంబంధించి 17,400 ఖాతాలు ఉండగా 9,910 మందిని రైతు భరోసా పథకానికి అర్హులుగా గుర్తించా మని తెలిపారు. అందులో 11,683 మంది రైతుల ఖాతాలకు 6,77,75,000 రూపాయలు ప్రభుత్వం జమ చేయడం జరిగిందని వివరించారు. వివిధ కారణాల వల్ల 1180 మంది రైతులకు సొమ్ము బ్యాంకు ఖాతాల్లోకి చేరలేద న్నారు. కారణాలు అన్వేషిస్తే వీరంతా ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతా నెంబరుతో రెవెన్యూ అధికారులను కలిసి వెబ్ ల్యాండ్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. బ్యాంకు ఖాతాలకు, వెబ్ ల్యాండ్‌కు రైతుల సెల్‌ఫోన్, ఆధార్ నెంబర్లు, జత చేసుకోవాలన్నారు.

### భీమిలి ఉత్సవాలలో భాగంగా బాలికలకు

# త్రో బాల్ మరియు కోకో ఆటల పోటీలు



భీమునిపట్నం : రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక , యువజన సర్వీసుల శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస రావు ఆదేశాల మేరకు బుధవారం భీమిలి ఉత్సవాలలో భాగంగా బాలికలకు భీమిలి మున్సిపాలిటీలో నిర్వహించిన ఆటల పోటిలను బుదవారం స్థానిక ఉడా మినీ స్టేడియంలో త్రో బాల్ మరియు కో కో ఆటల పోటీలు నిర్వహిం చారు. ఈ పోటిలకు భీమిలి పట్టణ ఉత్సవ కమిటి అధ్వర్యంలో భీమిలి, ఆనందపురం, తగరపు వలస లో గల సుమారు 11 పాఠశాల నుంచి 11టీం లుగా ఈ పోటిలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వైసిపి నాయుకులు జగ్గుపిల్లి ప్రసాద్, అల్లిపిల్లి నరసింగ రావు, జీరు వెంకట రెడ్డి, అక్రమాని మంగరాజు, అధ్యక్షులు వాసుపిల్లి కొండబాబు, హరికిరణ్ రెడ్డి, ఆర్.ప్రభాకర్‌నాయుడు. పి.విజయ్‌కుమార్, సినియర్ నాయకులు జి. వి.రమణ, చిల్ల శేకర్ రెడ్డి, స్టేడియం ఇంచార్జ్ జోసెఫ్ కిశోర్, మండల ఎం.ఇ.ఒ బాల మణి, వంశీరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, శివ రెడ్డి పాల్గొన్నారు.

# పేదప్రజల పాలిట వరం ముఖ్యమంత్రి సహాయనిధి

### దేముడుకి ఎమ్మెల్యే చేతులు మీదుగా అందజేత



పరవాడ : పరవాడ మండలం వాడచీపురుపల్లి గ్రామపంచాయతీ పందివానిపాలెం గ్రామానికి చెందిన పంది దేముడు అనారోగ్యంతో బాధపడు తున్నాడు.

ఆ వ్యక్తికి పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అధీప్‌రాజ్, ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి సిఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేశారు. పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజ్, వైయస్సార్సీపి కన్వీనర్ బురద రాజు చేతులు మీదుగా సిఎం రిలీఫ్ ఫండ్ ను బుధవారము అనా రోగ్యంతో బాధపడుతున్న పంది దేముడుకు అందజేశారు.

అనంతరము అయన ఎమ్మెల్యే అదీప్ రాజ్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో పరవాడ వైసిపి ఇంచార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 9న జరిగే తెప్పోత్సవానికి సజావుగా ఏర్పాట్లు

### *అరసవల్లి దేవాలయ కార్యనిర్వహణ అధికారి వి.హరిసూర్య ప్రకాష్*

శ్రీకాకుళం: అరసవల్లి శ్రీ సూర్యనారాయణస్వామి వారి తెప్పోత్సవానికి ముమ్మర ఏర్పాట్లను చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి వి.హరిసూర్య ప్రకాష్ తెలిపారు. బుధవారం ఇ.ఓ., శ్రీ సూర్యనారాయణ స్వామి వారి దేవాలయంలో తెప్పోత్సవ కార్యక్రమ నిర్వహణపై పాత్రికేయులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్తీక క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా నవంబరు 9వ తేదీ సాయంత్రం ఆలయం ఎదురుగా ఉన్న పుష్కరిణిలో స్వామివారి తెప్పోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పుష్కరిణిని పరిశు భ్రపరచామని, తెప్పోత్సవానికి కావలసిన ఏర్పాట్లను పూర్తి చేసామని తెలిపారు. గోదావరి పుష్కరాల ప్రమాదాన్ని ద ృష్టిలో వుంచుకుని, తెప్పోత్సవ నావలో అర్చకులు, దేవతామూర్తులు తప్ప వేరెవ్వరికీ ప్రవేశం లేదని తెలిపారు. భక్తులు దీనిని గమనించి సహకరించాలని కోరారు. గజ ఈతగాళ్ళు, ఎలక్ట్రికల్ జెనరేటర్ సిబ్బందికి మాత్రమే ఇన్సూరెన్స్ వుంటుందని, వారికి నావలోకి ప్రవేశం వుంటుందని చెప్పారు. మత్స్యశాఖ, అగ్నిమాపక శాఖలు గజ ఈతగాళ్ళను, మినీబోట్లను ఏర్పాటు చేస్తారని చెప్పారు. భక్తులకు బూందీ, పులిహోర, మంచినీటి ప్యాకెట్లను ఉచితంగా ఏర్పాటు చేస్తామన్నారు. వైద్యశిబిరాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నావికోత్సవాన్ని వీక్షించడానికి టెంట్లను ఏర్పాటు చేసామని, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసామని తెలిపారు. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో ఏర్పాట్లను సజావుగా చేసామని చెప్పారు. దేవాదాయ శాఖ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా కోలాటం, భజన, న ృత్య ప్రదర్శనలు వుంటాయన్నారు. భక్తులు కార్యక్రమాన్ని సద్వినియోగ పరచుకోవాలని కోరారు.

### అబ్దుల్లాపూర్‌మెట్ తహశీల్దార్ విజయారెడ్డి సజీవదహనం

# అత్యంత హేయమైన చర్య : ఆర్డీవో ఎస్.మల్లిబాబు



పెద్దాపురం : అబ్దుల్లాపూర్ మెట్ తహశీల్దార్ విజయారెడ్డి సజీవ దహనం అత్యంత హేయ మైన చర్యఅని ఆర్డీవో ఎస్.మల్లిబాబు అన్నారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం తహసీల్దార్ గా విధులు నిర్వహిస్తున్న విజయారెడ్డిని పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటన ఎంతో బాధాకరమని అన్నారు. ఏపీ రెవెన్యూ అసోసి యేషన్ పిలుపు మేరకు మంగళవారం ఆర్డీఓ కార్యా లయం వద్ద ఆర్డీవో ఎస్.మల్లి బాబు, కార్యాలయ ఏవో పి.చిన్నా రావు,డివిజన్లోని తహ సీల్దార్లు, రెవెన్యూ సిబ్బందితో కలిసి నల్ల బ్యాడ్జీలు ధరించి కార్యాలయం గేటు వద్ద నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.అనంతరం మౌనం పాటించి విజయారెడ్డి శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఇటువంటి ఘటనలు పునరావ ృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ రెవెన్యూ అసోసియేషన్ ప్రెసిడెంట్ జె.సి.సి కృష్ణారావు,సెక్రటరీ భాను,జిల్లా వైస్ ప్రెసిడెంట్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా చూడండి : కె.కె.రాజు



విశాఖసిటీ : విశాఖ ఉత్తర నియోజకవర్గం 38వ వార్డు అయ్యప్పనగర్, ఎస్.ఆర్.కె.ఆర్ ఫక్షన్ హాల్ లో ఆర్.పి మరియు, బిఎల్‌ఓలు, వాలంటిరీలతో సమీక్ష సమా వేశంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా విశాఖ ఉత్తర నియోజక వర్గ సమ న్వయకర్త కె.కె.రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ఈ ప్రభు త్వం అందరికీ ఉద్యోగ భద్రత కల్పిస్తుందని, ప్రభుత్వం చేపట్టే ప్రతీ కార్య క్రమ ప్రజలకు చేరేలా మీరం దరూ చూడా లని కోరారు. ఈ కార్యక్రమంలో 38వ వార్డు అధ్యక్షులు బొడ్డు ఎర్రునాయుడు, యన్.రవి కుమార్, ఐ.రవి కుమార్, సరస్వతమ్మ, చంద్రశేఖర్, ఢిల్లీరావు, కమల కుమారి, లోవరాజు, దొరబాబు, సతీష్, 38 వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి క్రీడలకు ఆరుగురు విద్యార్థుల ఎంపిక



దేవరాపల్లి : రాష్ట్ర స్థాయిలో వివిధ క్రీడా పోటీలకు దేవరాపల్లి మండలం నుంచి ఆరుగురు విద్యార్థిని, విద్యార్థులు ఎంపిక య్యారు. దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ఆరుగురు, స్థానిక కైరాళి ఇంగ్లీష్ మీడియం స్కూల్ నుంచి ఒకరు పలు క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బి. చంద్ర శేఖర్, ఎం. కె దినేష్ తెలిపారు. హైస్కూల్ నుంచి అండర్ 14 విభాగంలో ఈ నెల 12, 13, 14 తేదీల్లో గుంటూరు లో జరుగు పోటీలకు దామెరసింగ్ గణేష్, రూడి అవినాష్, బాలికల విభాగంలో దొగ్గ అనిత గుంటూరు లో 8,9,10 తేదీల్లో జరుగు పోటీలకు వెళ్లనున్నారు. అండర్ 17 బాలికల విభాగంలో కారక పాటి హైమావతి తెనాలిలో 8,9,10 తేదీల్లో జరుగు కబాడీ పోటీలకు,అదే విధంగా అండర్ 14 బాలిక విభాగం లో సబ్బవరపు వరలక్ష్మి, కైరాళి ఇంగ్లీష్ మీడియం స్కూల్ నుంచి రాష్ట్ర స్థాయి కబాడీ పోటీలకు వరదపురెడ్డి ఫణి కుమార్ ఎంపికైనట్లు వారు తెలిపారు.

# ఎమ్మెల్యే అమర్ ఆధ్వర్యంలో ఎనలేని అభివృద్ధి



అనకాపల్లి : అనకాపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అమర్ ఆధ్వర్యంలో ఎన్నడూ లేనంతగా అభివ ృద్ధి చెందుతుందని వైకాపా పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్ చేపట్టిన సంకల్పయాత్ర రెండేళ్లు పూర్తవడంతో పాటు ఎమ్మెల్యే అమర్ పాలన 150 రోజులు పూర్తయిన నేపథ్యంలో బుధవారం కేక్ కట్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా అమర్ కొద్ది నెలల్లోనే అభివ ృద్ధి పనులకు అనేక నిధులను తీసుకొచ్చారన్నారు. గ్రామీణ జిల్లా వైద్య కేంద్రంగా వున్న ఎన్టీఆర్ ఆస్పత్రికి రు. 30 కోట్లను తీసుకొచ్చా రన్నారు. ప్రజల తాగునీటి సమస్యను తీర్చడంలో భాగంగా అగనంపూడి నుంచి రు. 25 రూపాయల నిధు లతో తాగు నీటిని తీసు కొస్తున్నట్లు తెలిపారు. శాంతిభద్రత పరిరక్షణ నేపథ్యంలో సిసి కెమెరా లకు నిధులను కేటా యించినట్లు ఇటీవలే డీఎస్పీకి అందజేసినట్లు వెల్లడించారు. ఇవేకాక తాగునీరు, మురికి కాలువలు, సిసి రోడ్లకు సంబంధించి లక్షలాది నిధులను కేటా యించా రన్నారు. రోగులను ఆదుకోవడంలో భాగంగా సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి రు.98 లక్షలను విడుదల చేసినట్లు తెలిపారు. రానున్న కాలంలో మరింతగా అభివృద్ధి చేయనున్నట్లు వెల్ల డించారు. ఎన్టీఆర్ ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి ఈ నెల 11 న విశాఖలో వ్కెద్య విధాన పరిషత్తులో సమావేశం నిర్వహించ నున్నట్లు తెలిపారు.

కోర్టు, ఎమ్మార్వో, సబ్ రిజిస్ట్రార్ కార్యా లయాల నిర్మాణాలకు నిధులు విడుదల య్యాయని ముఖ్యమంత్రి సమక్షంలో వాటిని ప్రారంభించేందుకు ఎమ్మెల్యే నిర్ణయించినట్లు తెలిపారు. సమా వేశంలో కార్యదర్శి సూరిశెట్టి రమణ అప్పారావు, జాజుల రమేష్, పలకా రాము, గైపూరి రాజు, సకలా గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్మీ నియామక ప్రక్రియ ప్రారంభం

శ్రీకాకుళం: శ్రీకాకుళంలో ఆర్మీ నియామక ప్రక్రియ ప్రారంభం అయింది. నియామక ప్రక్రియకు ఆర్మీ అధికారులు తమ పనులను పూర్తి చేసుకోగా, జిల్లా యంత్రాంగం నియామక ప్రక్రియకు అవసరమగు సివిల్ పనులను పూర్తి చేసింది. బుధ వారం సాయంత్రం నుండి నియామక ప్రక్రియలో పాల్గొనుటకు అభ్యర్థులు రావడం ప్రారంభం కానుండటంతో అన్ని ఏర్పాట్లను చకచకా పూర్తి చేసారు. ఈ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జె నివాస్ పరిశీలించారు. ఎక్కడా ఎటువంటి లోపాలు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బుధ వారం రాత్రి నుండి శ్రీకాకుళంలో ఆర్మీ రెక్రూట్మెంట్ ర్యాలీ ప్రారంభం అవుతుందని కలెక్టర్ చెప్పారు. 49 వేల మంది అభ్యర్థులు ఆన్ లైన్ లో దరఖాస్తులు చేసుకున్నారని ఆయనతెలిపారు. నియామక ప్రక్రియ పూర్తిగా రాత్రి సమయంలో చేపడుతున్నందున అందుకు అవసరమై మౌళికసదుపాయాలు కల్పించామని చెప్పారు. అభ్యర్థుల పరుగు పరీక్షకు అవసరమగు ట్రాక్ ను ఏర్పాటు చేయడంతోపాటు అందుకు అవసరమైన విద్యుత్ దీపాలు, తాగు నీటి వసతులు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించామని చెప్పారు. ప్రక్రియలో పాల్గొనుటకు వచ్చే అభ్యర్థులు కోడి రామమూర్తి స్టేడియంకు ముందుగా చేరుకుని తమ కాల్ లెటర్ ఆధారంగా రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుంటారని ఆయన చెప్పారు. అందుకు కోడి రామమూర్తి స్టేడియంలోను 16 కంపార్ట్ మెంట్లలో అభ్యర్థులు వేచి ఉండటానికి వీలుగా ఏర్పాట్లు చేసామని చెప్పారు. ఆర్మీ అధికారులతోపాటు రెండు వందల మంది పోలీసులు ప్రక్రియలో నియంత్రణకు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులు నియామక ప్రక్రియకు సహకరించి ప్రశాంతంగా పూర్తి కావడానికి దోహదపడాలని కోరారు.

మాదక ద్రవ్యాలు వాడితే నియామక ప్రక్రియలో అనర్హత : శారీరక ధారుఢ్యానికి మాదక ద్రవ్యాలు (డ్రగ్స్) వాడిన అభ్యర్థులను ఆర్మీ నియామకాలకు చేపట్టే అన్ని ర్యాలీల్లోనూ నిషేధం విధిస్తామని ఆర్మీ నియామక అధికారి కల్నల్ భూపేందర్ సింగ్ తెలిపారు.

శ్రీకాకుళంలో జరుగుతున్న నియామక ప్రక్రియలో శ్రీకాకుళం నుండి క ృష్ణా వరకుగల ఆరు జిల్లాలతోపాటు పాండిచ్చేరీ రాష్ట్రంలోని యానాం జిల్లా అభ్యర్థులు పాల్గొంటున్నారని చెప్పారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులు మాత్రమే ర్యాలీలో పాల్గొనుటకు అర్హులని స్పష్టం చేసారు.

## ఫీజుల రెగ్యులేటరీ కమిటీ ఏర్పాటు

నాతవరం: మండలంలో ఉన్న ప్రైవేట్ స్కూల్లో ప్రభుత్వ అ నిబంధనల ప్రకారం ఫీజులు తీసుకునేలా ప్రభుత్వం ఆదేశాల మేరకు ఫీజుల రెగ్యులేటరీ కమిటీ నియమించినట్లు మండల విద్యాశాఖాధికారి టి.అమృతకుమార్ తెలిపారు. బుధవారం తాండవ గవర్నమెంట్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు ప్రభుత్వ నిబంధనల మేరకే తీసుకునేలా ఈ కమిటీ పరిశీలిస్తుందన్నారు. ఈ కమిటీలో సభ్యులుగా మండల విద్యాశాఖ అధికారి, నాతవరం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు, తాండవ గవర్నమెంట్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు సభ్యులుగా నియమించినట్లు తెలిపారు

## ఇంజనీరింగ్ విద్యలో పరిశోధన అనే అంశంపై కార్యశాల




గండేపల్లి: గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల నందు గల ఇంజనీరింగ్ విద్యలో పరిశోధన అనే అంశం పై కార్యశాల 7రోజుల కార్యశాల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం ఈ రోజు (06-11-2019 నుండి 13-11-2019వ తేదీ వరకు) ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. ఈ కార్యశాలకు ప్రారంభోత్సవ కార్యక్రమంలో డా. రమేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల అనుమానాలను నివృత్తి చేసుకోవడానికి విద్యార్థులకు సమర్ధవంతంగా శిక్షణ ఇవ్వడానికి ఇటువంటి కార్యశాలలు ఉపయోగపడతాయని పి.హెచ్.డి విద్యార్థులకు మెరుగైన సమాచారం అందించడానికి ఈ కార్యక్రమం ఎంతో దోహదం చేస్తుందని అన్నారు. ఆదిత్య రీసర్చ్‌డవలప్మెంట్ హెడ్ డా. కె.వి.ఎస్.రామచంద్రరావు మాట్లాడుతూ పరిశోధన అనే అంశంపై జరుగు ఈ కార్యశాలలో డా. దుర్గేష్ నందన్,డా.సంజీవ్ కుమార్, డా.పవార్ దుబే, డా. సుభ్రష్ ఫడి రిసోర్స్ పర్సన్స్ గా వ్యవహరిస్తారని, ఇఇఇ, ఈ.సి.ఇ.,మెకానికల్, విభాగాలకు చెందిన 45మంది ఉపాధ్యాయులు, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొనే ఈ కార్యక్రమంలో పరిశోధనలో ఎదురయ్యే సమస్యలపైనా, తక్కువ సమయంలో పరిశోధనా పత్రాలను అవగాహన చేసుకోవడం పైన, పరిశోధనా పత్రాన్ని ఏ జర్నల్ కు పంపాలి అనే అంశంపైనా, ఎలెక్ట్రికల్ ఇంజనీరింగ్ లో పరిశోధనా అంశాల పైనా ఈ కార్యశాలలో వివరించడం జరుగుతుందని తెలిపారు. డా.ఆదిరెడ్డి రమేష్ జన్మదినం సందర్భంగా డా.ఎం.శ్రీనివాసరెడ్డి, డా.టి.కె.రామకృష్ణారావు,డా.మూర్తి, వివిధ విభాగాల అధిపతులు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పుష్పగుచ్చాలను అందించి శుభాకాంక్షలు తెలిపారు.



జనసేన పార్టీ నూతన PAC సభ్యులుగా పంతం నానాజీ నియమితులయ్యారు.

## పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం పాలకవర్గం ఎన్నిక



నర్సీపట్నం: నర్సీపట్నం అబీద్‌సెంటర్‌లోని శ్రీశ్రీశ్రీ శ్రీమర్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి ఆలయం ఆలయ కమిటీ పాలకవర్గం బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. గౌరవ అధ్యక్షులుగా పెదపాటి అప్పయ్యశాస్త్రి, పెదపాటి గోవిందరావు, అధ్యక్షులుగా జవ్వాది నాగేశ్వర రావు(విశ్రాంత మండల విద్యాశాఖా ధికారి), ఉపాధ్యక్షులుగా కొవ్వాడ మధు, కార్యదర్శిగా కేశవకుర్తి బాబురావు, ఉప కార్యదర్శిగా చిప్పాడ సత్తిబాబు, కోశాధికారిగా కొమ్మోజు భోగలింగాచారి(విశ్రాంత అటవీశాఖాధికారి), సహాయ కోశాధికారి గానుగుల సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులుగా గానుగుల రమణబాబు, కిల్లంపల్లి రాజా, పెదపాటి కుమార్‌బాబు, లక్కోజు రాజు, కొప్పోజు నూకరాజు, సప్పా వెంకటరమణ, పాలమూరు బ్రహ్మాజీ, గానుగుల బాబ్జి, వానపల్లి నూకరాజు, పాలుమూరు బ్రహ్మాజీ, పెదపూడి నారాయణమూర్తి, కొవ్వాడ కృష్ణ, ముఖ్య సలహా కమిటీ సభ్యులుగా చిట్టిమోజు బాబురావు, దార్ల ప్రకాశరావు, కడియం రాము, మొల్లేటి రాము, పూడి సత్యనారాయణ, సాంబశివరావు, లక్కోజు బ్రహ్మాజలు ఎన్నికయ్యారు.

## జీడి ఉత్పత్తిదార్లు ప్రభుత్వ రాయితీలు పొందాలి



గొలుగొండ: ప్రతీ గ్రామాల్లో జీడి ఉత్పత్తిదార్లు సంఘాలుగా రైతులు ఏర్పడి ప్రభుత్వం ఇచ్చే రాయితీలు పొందాలని జీవనోపాదుల ఏపిఎం సాయిప్రసాద్ తెలిపారు. జోగుంపేటలో మంగళశారం జీడి ఉత్పత్తిదారు సంఘం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడి ఉత్పత్తిదార్ల సంఘంకు ప్రభుత్వం నుండే కాకుండా బ్యాంక్‌ల నుండి రుణాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పిక్కల సేకరించిన తర్వాత వాటిని అరబెట్టడం కోసం ప్రభుత్వం టార్పాన్లు రాయితీపై ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జీడి ఉత్పత్తులు పెంచుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కోరారు. సంఘాల్లో ప్రతీ రైతు ఉండాలని దీని కోసం సిసిలు గ్రూపులు తయారు చేయాలని చెప్పారు. నాణ్యమైన జీడిపిక్కల వలనే రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు చిట్ల అప్పారావు, సిసి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## తెదేపాకు ముమ్మిడి రాజబాబు రాజీనామా



కాకినాడ రూరల్ : కాకినాడ రూరల్ గంగనాపల్లి మండల మాజీ ఉపాధ్యక్షులు, తెలుగుదేశం నాయకులు,ముమ్మిడి రాజబాబు తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసారు. బుధవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ తనను నమ్ముకున్న కార్యకర్తలకు సరైన న్యాం చేయలేక పోతుండటం,ఆరోగ్యం కూడా సహకరించక పోవడంతో రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.ఇంత వరకు తనకు అండదండలుగా నిలిచిన ప్రతి కార్యకర్తకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు

## ఎంఎస్ఎన్ చారిటీస్ వేదపాఠశాలను ఆకస్మికంగా తనిఖీ



కాకినాడ: బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా వేద విద్యార్ధులకు స్కాలర్ షిప్పులు మంజూరు చేసేలా చర్యలు తీసుకున్నామని దేవాదాయ శాఖ డిసి దుర్గా ప్రసాద్ తెలిపారు. బుధవారం ఎం ఎస్ ఎన్ చారిటీస్ వేద పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్ధుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్ధులకు మౌళిక వసతుల కల్పనపై నిర్లక్ష్యం వహిస్తున్న ఇఓ చలపతిరావు పై కొంత అసహనం వ్యక్తం చేశారు.విద్యార్ధులకు ఉదయం అల్పాహారం ఏమి పెడుతున్నారు, మెనూ ఏవిధంగా ఇస్తున్నారు? తదితర విషయాలపై సిబ్బందిని ప్రశ్నించగా కుక్ ఉదయం మజ్జిగ అన్నం పెడుతున్నామని చెప్పడంతో మండిపడ్డారు. 15 మంది ఉన్న విద్యార్ధులకు పూర్తిస్థాయిలో అల్పాహారం వండించలేరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్ధులకు ఏమి అవసరమో తెలుసుకుని వాటిని ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు.అలాగే విద్యార్ధుల బయోమెట్రిక్ అటెండెన్స్‌పై ఆరా తీశారు. విద్యార్ధుల తరగతి గదుల్లో బయోమెట్రిక్ అటెండెన్స్ ఏర్పాటు చేయాలని, దోమలతో విద్యార్ధులు ఇబ్బందులు పడుతున్నారని సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో 6ఏ, 6బి ఆలయాల్లో వేద విద్యను అభ్యసించే విద్యార్ధులకు అర్చక వెల్ఫేర్ నుండి 6 సంవత్సరాల కోర్సుకు రూ. 1.50లక్షలు, 12 సంవత్సరాల కోర్సుకు రూ.3లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసేవారమని,అలాగే చారిటీస్ విద్యార్ధులకు అర్చక వెల్ఫేర్ నుండి ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళి చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్ధులు విద్యతో క్రీడల్లో కూడా రాణించాలని క్రికెట్, క్యారెమ్స్, చదరంగం వంటివి అందజేస్తామన్నారు.

అదేవిధంగా బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా 15 మంది విద్యార్ధులు ధరఖాస్తు చేసుకున్నారని త్వరలో వారికి మంజూరవుతాయన్నారు. అలాగే వేద విద్యను ప్రోత్సహించేందుకు దాతలు ముందుకు వచ్చి సహాయ, సహకారాలందించాలని కోరారు.

## పరవాడలో రేషన్ డిపోను తనిఖీ చేసిన అదీప్‌రాజ్

### త్వరలో నాణ్యమైన బియ్యం అందజేస్తామనీ హామీ



పరవాడ:మండలకేంద్రమైన పరవాడలోగల రేషన్ డిపోనెంబర్ 20ను బుధవారము స్ధానికశాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ అకస్మిక తనిఖీ చేసారు.

అనంతరము అయన కార్డుదార్లుతో మాట్లడుతూ డిపోయజమాని సమయాన్ని పాటిస్తున్నారాలేదా అని అడిగారు. దానికికార్డుదార్లు రేషన్ డిపో సమయపాలన పాటిస్తారు అని తెలిపారు.ఈకార్యక్రమంలో వైసిపి సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పైలశ్రీనువాసు రావు, పరవాడ వైసిపి ఇంచార్జి అన్నంరెడ్డిఅజయ్ రాజ్ ,మండలపార్టిప్రెసిడెంట్ సిరపురపుఅప్పల నాయుడు,వైసిపి జిల్లాప్రదాన కార్యదర్శీ చుక్కరామునాయుడు, పైలపోతి నాయుడు (పెద్దింటి),పోతలఅప్పల నాయుడు, బండారు రామారావు,పైలహరేష్ తథితర్లు పోల్గొన్నారు.

## ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ




గొలుగొండ: ప్లాస్టిక్ నిషేదంపై గొలుగొండ, జోగుంపేట పంచాయతీ కార్యదర్శి రఘు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి ఎస్‌కె.జాను ఆధ్వర్యంలో గ్రామ వాలంటీర్లు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించాలని ప్రజలకు అవగాహన కలిగే విధంగా జోగుంపేట నుంచి గొలుగొండ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

## ఏఎస్సై సత్యనారాయణ నివాసంలో ఏసీబి దాడి

### పలు కీలక పత్రాలు స్వాధీనం



కాకినాడ: కాకినాడ జగన్నాధపురం మరిడమ్మపేలో ఏఎస్సై గుణ్ణం సత్యనారాయణ చౌదరి నివాసంలో ఏసిబి అధికారుల సోదాలు నిర్వహించారు.కాకినాడ పోర్ట్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా పని చేస్తున్న గుణ్ణం సత్యనారాయణ చౌదరి కాకినాడలో రెండు , రావులపాలెంలో రెండు, సామర్లకోటలో ఒక చోటు ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నారు. ఈ సోదాలలో 1.5 కేజీల బంగారు ఆభరణాలు, కేజీ వెండి సహా రూ. రెండున్నర కోట్లు విలువైన ఆస్తి పత్రాలు స్వాధీనం చేసుకున్నారు.బ్యాంకు అకౌంట్లతో సహా,పలు బ్యాంకుల్లో లాకర్లు కలిగి ఉన్నట్టు ఏసిబి అధికారులు గుర్తించారు.

## అమితాబ్, రజనీ అతిథులుగా...



ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా(ఐఎఫ్ఎఫ్ఐ)50వ ఎడిషన్ ప్రారంభోత్సవ వేడుకలకు దిగ్గజ నటులు అమితాబ్‌బచ్చన్, రజనీకాంత్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. గోవా వేదికగా ఈ నెల 20 నుంచి 28వ తేదీ వరకు ఈ అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ జరుగనున్నది. 2014లో జరిగిన 45వ ఇఫీ వేడుకల్లో పాల్గొన్న ఈ అగ్ర నటులు మరోసారి ఈ ఏడాది చలనచిత్రోత్సవంలో సందడి చేయబోతున్నారు. ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భారతీయ సినీ రంగానికి చేసిన అసమాన సేవలకు గాను ఐకాన్ ఆఫ్ గోల్డెన్‌జూబ్లీ పురస్కారంతో రజనీకాంత్‌ను సత్కరించబోతున్నారు. అమితాబ్ బచ్చన్ నటించిన సినిమాల్ని ప్రత్యేకంగా ప్రదర్శించనున్నారు. ఈ చలన చిత్రోత్సవంలో 76 దేశాలకు చెందిన 190కిపైగా సినిమాల్ని ప్రదర్శించనున్నారు. 24 ఆస్కార్ నామినేషన్స్ చిత్రాలతో పాటు యాభై ఏళ్ల క్రితం రూపొందిన కొన్ని అరుదైన సినిమాలు వీక్షకుల్ని అలరించబోతున్నాయి. తొలిసారి కొంకణీ చిత్రాలకు ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌లో స్థానాన్ని కల్పించారు.



## పింక్ రీమేక్‌లో..?



తెలుగు చిత్రసీమ అగ్ర కథానాయికల్లో ఒకరిగా చెలామణి అవుతోంది మంగళూరు సోయగం పూజాహెగ్డే. పలు భారీ సినిమాల్లో నాయికగా ఈ అమ్మడి పేరే ప్రముఖంగా వినిపిస్తున్నది. ప్రస్తుతం ఈ సుందరి అల వైకుంఠపురములో జాన్ చిత్రాల్లో నటిస్తున్నది. తాజా సమాచారం ప్రకారం పూజాహెగ్డే పింక్ తెలుగులో రీమేక్‌లో నటించే అవకాశం సొంతం చేసుకున్నట్లు తెలిసింది. బాలీవుడ్‌లో విజయం సాధించిన పింక్ (2016) చిత్రాన్ని తెలుగులో పవన్‌కల్యాణ్ ప్రధాన పాత్రలో పునర్నిర్మించబోతున్నారు. హిందీ చిత్రంలో తాప్సీ పోషించిన పాత్రను తెలుగులో పూజాహెగ్డే చేయబోతున్నదని సమాచారం.

వేణుశ్రీరామ్ దర్శకత్వం వహిస్తారు. తెలుగు రీమేక్‌లో నాయికగా పూజాహెగ్డేను నటింపజేసేందుకు బోనీకపూర్ ఆసక్తిగా ఉన్నారని చెబుతున్నారు. ప్రస్తుతం సంప్రదింపులు ముగిశాయని, ఈ సినిమాలో నటించేందుకు పూజాహెగ్డే సుముఖంగా ఉందని సమాచారం. పింక్ చిత్రం తాప్సీకి మంచి పేరు తెచ్చిపెట్టింది. బాలీవుడ్ కెరీర్‌కు టర్నింగ్‌పాయింట్‌గా నిలిచింది. భిన్న భావోద్వేగాల సమాహారంగా సవాలుతో కూడిన ఆ పాత్ర ఇప్పుడు పూజాహెగ్డేను వరించడం విశేషం.

# విత్తన కొరతతో రైతుకు తీవ్ర నష్టం

## వ్యవసాయ శాఖా మంత్రి కన్న బాబు



కాకినాడః వ్యవసాయ శాఖా మంత్రి కురసాల కన్న బాబు 6న మార్టిలు వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త ఆ పాలడుగు సత్యనారాయణ, వ్యవసాయ ఉప సందాలకులు వి.టి. రామారావు మరియు సహాయ వ్యవసాయ సంచాలకులు జి.వి.పద్మ, కాకినాడ వారితో వ్యవసాయపరంగా విత్తనాల గురించి చర్చించటం జరిగింది. ముఖ్యంగా రైతులు ఎక్కువగా ప్రైవేటు డీలర్స్ మరియు విత్తనా పంపిణీ సంస్థల మీద ఆధారపడటం వలన వారు సకాలంలో అవసర మేరకు కావాల్సిన నాణ్యమైన విత్తనాలను రైతులకు అందుబాటులో లేకపోవడము, ధరలు అధికంగా ఉండటము, విత్తనం కొరకు ఇతర రాష్ట్రాల పై (తెలంగాణ) ఆధార పడటం వలన, జన్యు పరంగా లోపాలు కుడా ఉండటం వలన రైతు తీవ్రంగా నష్టపోవటం జరుగుతుంది.

ఇంకా క్షేత్ర స్థాయిలో ప్రైవేటు వ్యక్తులనుండి సరియున స్పందన లేకపోవడం మొదలైన సమస్యలను దృష్టిలో ఉంచుకొని వాటిని అధిగామించుటకు గాను రాష్ట్ర ప్రభుత్వం సరైన మరియు నాణ్యమైన విత్తనాలను రైతుకు అందించేందుకు రైతు స్థాయి లోనే మండల స్థాయిలో / వ్యవసాయ సబ్ డివిజన్ స్థాయిలో / నియోజకవర్గ స్థాయిలో అభివృద్ధి చెందగల ఫార్మర్ ప్రొడ్యూస్ అర్గనైజేషనె గ్రూప్స్‌ను ఏర్పరచి పంట కాలం ముందుగా వారితో ఒప్పందం చేసుకొని వ్యవసాయ శాఖ పర్యవేక్షణలో విత్తనాలను ఉత్పత్తి చేయించి తక్కువ ధరకి రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించడానికి కావలసిన ప్రణాళికలను తయారు చేస్తున్నామని తెలపటం జరిగింది. ఇది రాబోయే సీజన్ నుండి ప్రారంభించటం జరుగుతుందని తెలిపారు. ఇంకా రేషన్ దుకాణాల నుండి సన్న బియ్యం అందించాలన్నది ఈ ప్రభుత్వ ధ్యేయం కనుక ఆ దిశగా రైతులను సన్న రకాలను పండించే దిశగా ఈ రబీ సీజన్ నుండే ప్రోత్సహించడం జరుగుతుంది. ముఖ్యంగా ఉభయ గోదావరి జిల్లాలో రైతాంగం ఎంటియు 3626 ఆనే బొండాలు రకాన్ని ఎక్కువగా పండించటం అలవాటు. ఈ రకం ధాన్యానికి కేరళ మార్కెట్ ధరలో హెచ్చు తగ్గులు ఉండటం వలన రైస్ మిల్లర్స్ గత రెండు సీజన్ల నుండి పూర్తి స్థాయిలో పండించిన మొత్తం పంటను కొనుగోలు చేయకపోవటం వలన మరియు ప్రభుత్వ పరంగా సివిల్ సప్లై ద్వారా ఈ ముతక రకాన్ని కొనలేక పోవటం వలన, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని అధిగమించటానికి గాను మరియు రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయుటకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటం వలన రైతు స్థాయిలో బొండాలు రకం మార్పిడి చేసే విదంగా సన్నాహాలు చేయటం జరుగుతుంది. ఇంకా ఎంటియు 3626 (బొండాలు) రకం ను పూర్తి స్థాయిలో సాగు విస్థీర్ణం తగ్గించడం ప్రత్యామ్యం గా ఎంటియు 1121 (శ్రీ దృతి) రకాన్ని సాగు చేసే విధంగా రైతులను ప్రోత్సహించటం జరుగుచున్నది. దీనికి సంబంధించి క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ పరంగా విత్తనాల పంపిణీ కి ప్రణాళిక చేస్తున్నామని తెలియజేశారు.

# ప్రజాసంకల్ప యాత్రకు రెండేళ్లు



రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్ రెడ్డి చేసిన ప్రజాసంకల్ప యాత్ర మొదలుపెట్టి బుధవారం నాటికి రెండు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా విశాఖ నగర పార్టీ కార్యాలయంలో జరిగిన కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్న విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు

### చరిత్రలో చూడలేదు.. భవిష్యత్తులో కూడా చూడలేం..

పశ్చిమ గోదావరి : ప్రజా సంకల్ప యాత్ర ప్రారంభించి నేటికి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు డిప్యూటీ సీఎం ఆళ్ల నాని శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు పాదయాత్ర చేసి చరిత్ర సృష్టించారని గుర్తుచేశారు. 3,648 కి.మీ సుదీర్ఘంగా సాగిందన్నారు. అధికారంలో వచ్చాక 90 శాతం హామీలు నెరవేర్చారని తెలిపారు. ఈ రికార్డు చూడలేమని డిప్యూటీ సీఎం వ్యాఖ్యానించారు.

### 8న శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి

# మార్గశిర మాస రాట మహోత్సవము

బురుజుపేట : నగరంలో గల శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో 27-11-2019 నుండి 26-12-2019 వరకు మార్గశిరమాస ఉత్సవములు అత్యంత వైభవంగా నిర్వహించ బడును, ఈ ఉత్సవమునకు శుభారంభ సూచి కగా రాటమూహూర్తం 08-11-2019 శుక్రవారం నిర్వహించబడును. ప్రతి సంవత్సరము కార్తీక శుద్ధ ఏకాదశి రోజున రాట వేసి మార్గశిర మాసోత్సవములకు శ్రీకారం చుట్టుట ఆనవాయితీగా వస్తున్నది. ఆ సాంప్రదాయం ప్రకారం 08వ తేదీ శుక్రవారం ఉ. 10.45 ని..లకు నాదస్వర సుస్వారాలతో, వేదమంత్రాలతో శాస్తోక్తంగా నిర్వహించుటకు విస్తృత ఏర్పాట్లు చేయడమైనదని శ్రీ కనకమహాలక్ష్మి



అమ్మవారి దేవస్థాన ఉప కమిషనర్, కార్యనిర్వహ ణాధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

# ఈనెల 9,10 తేదీల్లో జరిగే భీమిలి ఉత్సవం పోస్టర్ విడుదల



భీమునిపట్నం : ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస రావు నేతృత్వంలో ఈ నెల 9,10 తేదిల్లో అత్యంత వైభవంగా భీమిలి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా బుదవారం మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు చేతుల మీదుగా భీమిలి ఉత్సవం పోస్టర్ విడుదల చేశారు. మంత్రి మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా భీమిలి నియోజవర్గంలో ఉన్న అన్ని సంఘాల వారు, వర్తక సంఘాలు, ఎటువంటి బేధం లేకుండా వివిధ రాజకీయ పార్టీ లను కలుపుకుంటూ ఈ యొక్క ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో ఉన్న అన్ని స్కూల్ విద్యార్థిని, విద్యార్థులకు కబడ్డీ, వాలీ బాల్, కో కో, త్రో బాల్, వ్యాసరచన పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలు, మ్యుస్సికాల్ చైర్స్, కాండీల్ గేమ్, పాస్ ఇన్ ది బాల్స్, పడవల పోటీలు, ఎడ్ల బండి పోటీలు. బాడీ బిల్డింగ్ ప్రదర్శన, బాక్సింగ్ పోటీలు నిర్వహిస్తు న్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టూరిజం అధికారి పూర్ణిమ నాయకులు బెహర బాస్కరరావు, గాడు వెంకటప్పుడు, ఎల్లయ్య, మైలపల్లి. షణ్ముఖరావు,కైతపల్లి శ్రీనివాసరావు, జీరు వెంకటరెడ్డి, డింగి.హరి కిరణ్ రెడ్డి, గుండాసు మధు నాయుడు, నాలుగవ వార్డ్ నాయుకులు బొట్ట అప్పలరాజు, జే.ఎస్.రెడ్డి, కొండపల్లి. వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# చీఫ్ సెక్రటరీ బాధ్యతలు అప్పగించాకే

అమరావతిః ఏపీ చీఫ్ సెక్రటరీగా ఉన్న ఎల్వీ సుబ్రహ్మణ్యాన్ని బదిలీ చేసిన జగన్ సర్కారు.. ఆయన స్థానంలో భూ పరిపాలన విభాగం చీఫ్ కమిషనర్‌గా ఉన్న నీరబ్ కుమార్‌కు తాత్కాలిక బాధ్యతలను అప్పగించింది. బుధవారం ఉదయం నీరబ్ కుమార్‌కు ఎల్వీ సుబ్రహ్మణ్య బాధ్యతలు అప్పగించారు. కానీ తనకు అప్రాధాన్యమైన పదవిని కేటాయించడం పట్ల ఎల్వీ సుబ్రమణ్యం అలకబూనారు. బాపట్లలోని మానవ వనరుల అభివృద్ధి కేంద్రం డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు స్వీకరించకుండానే ఆయన తన ఉద్యోగానికి సెలవు పెట్టారు. ఎల్వీ సుబ్రహ్మణ్యం నవంబర్ 6 నుంచి డిసెంబర్ 6 వరకు.. నెల రోజులపాటు సెలవు మీద వెళ్లారు. ఆయన పదవీ కాలం మరో ఐదు నెలల్లో ముగియనుంది. కాగా ఎల్వీ బదిలీ వ్యవహారం పట్ల కేంద్రం సీరియస్‌గా ఉందని.. ఆయనకు కేంద్రంలో కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఏపీ సీఎంవోలో చీఫ్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వర్తిస్తోన్న ప్రవీణ్ ప్రకాశ్‌కు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఆ తర్వాత కొద్ది రోజులకే ఎల్వీని బదిలీ చేస్తున్నట్టు ప్రవీణ్ ప్రకాశ్ పేరిట ఆదేశాలు జారీ చేశారు

# రక్తదానం చేయండి ప్రాణదాతలుగా నిలవండి

## శ్రీచైతన్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం




విశాఖ సిటీ : శ్రీచైతన్య విద్యాసంస్థల ఛైర్‌పర్సన్, డా॥. ఝాన్సీ లక్ష్మీబాయి 71వ జన్మదిన సందర్భంగా ప్రతి సంవత్సరం మాదిరిగానే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని శ్రీచైతన్య కాలేజీలు మరియు స్కూల్స్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించడమైనది.

ఈ సందర్భంగా ఆశిల్ మెట్టలో గల శ్రీచైతన్య ప్రాంగణంలో ఆ సంస్థ డైరెక్టర్ టి. నాగేంద్ర కుమార్ స్వయంగా పాల్గొని ఈ రక్తదాన శిబిరాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన సమయంలో రక్తం అందక ప్రాణాలు కోల్పోతున్న అనేక మందికి సహాయం చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న శ్రీచైతన్య కాలేజ్ మరియు స్కూల్స్ లో వేలాది మంది శ్రీచైతన్య సిబ్బంది ఈ రక్తదాన శిబిరంలో పాల్గొంటున్నారని తెలిపారు. వైజాగ్ జోన్ నుంచి ఎ.ఎస్.రాజా, రెడ్ క్రాస్, రోటరీ, లైఫ్ షేర్ మరియు ఎన్.వి.ఎన్. బ్లడ్ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో దాదాపుగా 400 మంది శ్రీచైతన్య సిబ్బంది రక్తదానం చేసారు. ఈ కార్యక్రమంలో శ్రీచైతన్య కాలేజ్ ఎ.జి.ఎమ్. - కె.వి. రమణ, శ్రీ చైతన్య స్కూల్స్, ఎ.జి.ఎమ్. -ఎమ్.వి. సురేష్, డీన్లు కె. శేషుబాబు, ఎస్.రఘు కుమార్, కె.ఎస్.ఆర్.సి. మూర్తి, కె.బంగారు బాబు మరియు ఇతర సిబ్బంది పాల్గొని ఈ శిబిరాన్ని విజయవంతం చేశారు.




### ఏషియన్ పెయింట్స్ సిఎస్ఆర్ నిధులతో చేస్తున్న

# సేవలు అభినందనీయం

## రాష్ట్ర కార్మికశాఖ మంత్రి జయరామ్



అచ్యుతాపురం : ఏషియన్ పెయింట్స్ సిఎస్ఆర్ నిధులతో చేస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ అన్నారు. బుధవారం ఏషియన్ పెయింట్స్ సిఎస్ఆర్ నిధులతో అచ్యుతాపురం,రాంబిల్లి మండలాల్లో 10 పాఠశాలలో మౌళిక సదుపాయలు కల్పనలో బాగంగా మత్స్యకార గ్రామమైన పూడిమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కల్పించిన వసతులను ఆయన ప్రారంభించారు .అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి అయిన నాలుగు నెలలోనే 4 లక్షల ఉద్యోగాలను కల్పించిన ఘనత ముఖ్యమంత్రి జగన్ కే దక్కుతుందన్నారు . పిల్లల భవిశ్యత్ కోసం అమ్మఒడి పథకం ద్వార విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాలో 15 వేలు జమ చేస్తామన్నారు .పరిశ్రమలలో స్థానికులకు 75 % ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు .అనంతరం ఏషియన్ పెయింట్స్ పరిశ్రమను సందర్శించి కార్మికులకు కల్పిస్తున్న సదుపాయయలను పరిశీలించి ప్లాంట్ అవరణలో మొక్కలు నాటారు .అంతకముందు స్థానిక వైసిపి నాయకులు పరిశ్రమలలో యువతకు ఉపాధి కల్పించాలని వినతిపత్రం అందజేశారు .ఈ కార్యక్రమంలో ఏషియన్ పెయింట్స్ జనరల్ వర్క్స మేనేజర్ రాజీవ్ గుప్త ,వైసిపి నాయకులు వాసుపల్లి శ్రీనివాసరావు ,చేపల శ్రీనివాసరావు , చోడిపల్లి అప్పారావు , పోలవరపు పారునాయుడు , మేరుగు అప్పలనాయుడు , గంగిరి రవి , ఎరిపల్లి బాను తదితరులు పాల్గొన్నారు .

# ఏఎస్ఐ నివాసంలో ఏసీబీ సోదాలు

కాకినాడ : జగన్నాధపురం మరీడమ్మపేటలో ఏఎస్ఐ గుణ్ణం సత్యనారాయణ చౌదరి నివాసంలో ఏసీబీ అధికారుల సోదాలు చేపట్టారు. కాకినాడ పోర్ట్ పోలీస్ స్టేషన్‌లో ఆయన ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. సత్యనారాయణ చౌదరికి సంబంధించిన కాకినాడలో రెండు ప్రాంతాలు, రావులపాలెంలో రెండు, సామర్లకోటలో ఒక చోట ఏకకాలంలో ఏసీబీ అధికారులు సోదాలు చేప్టటారు. ఈ సోదాల్లో కేజీన్నర బంగారు ఆభరణాలు, కేజీ వెండి సహా రూ. రెండున్నర కోట్లు విలువైన ఆస్తి పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు అకౌంట్లు సహా, పలు బ్యాంకుల్లో లాకర్లు కలిగి ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

# అర్జీల పరిష్కారంలో మానవీయ కోణం ఉండాలి

## ముఖ్యమంత్రి ప్రత్యేక అధికారి హరికృష్ణ




విశాఖపట్నం : స్పందన వినతుల పరిష్కారంలో మానవీయ కోణం, సానుభూతి అంశాలను కూడా చేర్చుకుంటే ప్రతి ఒక్కరికి సంతృప్తికరమైన సమాధానాలు ఇవ్వడం సాధ్యపడుతుందని ముఖ్యమంత్రి ప్రత్యేక అధికారి హరికృష్ణ పేర్కొన్నారు. స్పందన వర్క్ షాప్ ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతుల ద్వారా అధికారులకు పూర్తి అవగాహన వచ్చినట్లు భావిస్తున్నానన్నారు. గ్రూప్ డిస్కషన్ తర్వాత మాట్లాడిన అధికారుల దృక్పథంలో స్పష్టమైన మార్పు కనబడింది అన్నారు. విన్నపాలను ఓపికతో వినడం చదవడంతో పాటు పరిష్కరించే సమయంలో కూడా సంయమనం పాటించాలన్నారు. ముఖ్యంగా వివిధ శాఖల సమన్వయం పరస్పర సహకారం అందించు కుంటే పరిష్కారం వేగంగా స్పష్టంగా సంతృప్తికరంగా ఉంటుందన్నారు.

విశాఖపట్నం సూపరిం టెండెంట్ ఆఫ్ పోలీస్ బాబూజీ మాట్లాడుతూ తమ శాఖకు వచ్చే కుటుంబ, భూమి తగాదాల లో ఇద్దరు పార్టీలను సంతృప్తి పరచడం అనేది కత్తి మీద సామే అవుతుందని చెప్పారు. వివాహ సంబంధాల విషయంలో స్త్రీల సానుభూతి పోలీసులకు అవరోధంగా మారు తుంది అన్నారు.

గ్రూప్ డిస్కషన్ అనంతరం అధికారులు మాట్లాడుతూ తమ బృందంలో చర్చించిన అంశాలను, మెరుగైన సంతృప్తికరమైన పరిష్కారాలు కనుగొన్నామని, వర్క్ షాప్ ద్వారా దరఖాస్తుల పరిష్కా రంలో మరింత నైపుణ్యాన్ని సంపా దించాం అని తెలిపారు. ఎంపీడీవోలు విజయ, పోలినా యుడు, తాసిల్దార్లు రామారావు, వేణుగోపాలరావు స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాంబాబు తాము అభివృద్ధి చేసుకున్న ఎండార్స్మెంట్ లను చదివి వినిపించారు. సీఎం కార్యాలయ కార్యదర్శి సాల్మన్ ఆరోఖ్యరాజ్, పురపాలక శాఖ కమిషనర్ విజయ్ కుమార్, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ అరుణ్ కుమార్, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ వినయ్ చంద్, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ డీ. మురళీకృష్ణ, విశాఖ పోలీస్ కమిషనర్ ఆర్కె మీనా, రాజమహేంద్రవరం ఎస్పి డాక్టర్ షెముషి బాజ్పేయ్, జీవీఎంసీ కమిషనర్ జి. సుజన, పాడేరు ఐటీడీఏ పీవో కే బాలాజీ, సబ్ కలెక్టర్ వెంకటేష్ ఆర్డీవో పెంచల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



### బోనులో నిలబడే వ్యక్తికి

# విమర్శించే హక్కు లేదు

## టీడీపీ అధినేత చంద్రబాబు

చిత్తూరు: ప్రతి శుక్రవారం బోనులో నిలబడే వ్యక్తికి టీడీపీని విమర్శించే హక్కు లేదని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. జిల్లా టీడీపీ విస్తృతస్థాయి సమావేశానికి చంద్రబాబు హాజరై మాట్లాడారు. అన్నా అంటూనే ఎల్వీ సుబ్రమణ్యాన్ని జగన్ గంగలో ముంచారన్నారు. కొందరు పోలీసులు ఆంబోతుల్లా ప్రవర్తిస్తూ తప్పుడు కేసులు పెడుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పులివెందుల పంచాయితీలు చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. పవన్ కళ్యాణ్ మనోభావాలు దెబ్బతినేలా వైసీపీ నేతలు మాట్లాడుతున్నారని మండి పడ్డారు. జగన్‌కు డబ్బు పిచ్చి ఎప్పటికీ పోదని చెప్పారు.

నీరో చక్రవర్తి ఫిడేలు వాయించి నట్టు.. సాయంత్రం 5 అయితే వీడియో గేములు ఆడుకుంటున్నారని విమర్శించారు. వైసీపీ నేతల పిచ్చి పరాకాష్టకు చేరిందన్నారు. పంచాయతీ ఆఫీసులకు వైసీపీ రంగులు మారుస్తున్నారన్నారు. పోలీస్‌స్టేషన్లకు కూడా వైసీపీ రంగులు వేస్తారేమోనని అనుమానం వ్యక్తం చేశారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com